# రగులుతున్న పశ్చిమాసియా

## అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు

### అధినేతను కోల్పోయినా గర్జిస్తున్న ఇరాన్

ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర ప్రతీకారదాడులు.. సెంట్రల్ ఇజ్రాయెల్ ను తాకిన క్షిపణులు
సౌదీలోని అమెరికా ఎంబసీపై దాడి.. హర్ముజ్ జలసంధి మూసివేత
హర్ముజ్ లో నిలిచిన 700నౌకలు.. లెబనాన్‌పై ఇరాన్ దాడి -
ఇప్పటి వరకు 40 మంది మృతి.. ఇరాన్‌పై యూఏఈ, బహ్రెయిన్ ఎటాక్ ..
ఇరాన్ సుప్రీం ఎన్నిక జరుగుతుండగా భవనంపై ఇజ్రాయెల్ దాడి
ఇరాన్ పై కొనసాగుతున్న సైనికచర్య.. సుదీర్ఘకాలం కొనసాగే అవకాశం
కాళ్ళబేరానికి ఇరాన్ - ట్రంప్ సంచలన ప్రకటన

**మహా నెట్ వర్క్ :** పశ్చిమాసియా రగులుతోంది. యుద్ధ జ్వాలలు సోమవారం మరింత తీవ్రరూపు దాల్చాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాల సైనిక చర్య ఉద్ధృతంగా సాగుతోంది. లెబనాన్ నుంచి తమపై దాడికి తెగబడిన హెజ్బొల్లాపైనా ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. అటు ఇరాన్, దాని మిత్రదేశాలు, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లోని చమురు శుద్ధి కేంద్రాలపై దాడికి దిగాయి. ఈ దాడుల తీవ్రత పెరుగుతుండగా యుద్ధం నుంచి బయటపడే స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం వంటి అంశాలు సుదీర్ఘ పోరాటానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య మరికొన్ని వారాలు కొనసాగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు ఇరాన్ ఓవైపు అధ్యక్షుడిని కోల్పోయినా పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తోంది. లెబనాన్‌పై ఇరాన్ దాడి చేయగా, ఇప్పటి వరకు 40 మంది మృతి చెందారు. 246 మందికి గాయాలయ్యాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర ప్రతీకారదాడులు జరుపుతోంది. సెంట్రల్ ఇజ్రాయెల్‌ను ఇరాన్ క్షిపణులు తాకాయి. ఇరాన్ క్షిపణులు దూసుకొచ్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

వివరాలు 2లో



**ఇరాన్‌లో ఉద్రిక్తతలు..**
ప్రధాని మౌనాన్ని వీడాలి
ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
2లో

**8 మంది దేశాధినేతలకు మోదీ ఫోన్**
2లో

Follow: @ANNTELUGU
04-03-2026
ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 66 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



### తెలంగాణ జాగృతి చీఫ్

# కవిత అరెస్టు

### మూసీలో నిర్మించే అక్రమ వెంచర్లపై భగ్గు
### చేతికి స్వల్ప గాయం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని మూసీ వద్ద నిర్మిస్తున్న ఆదిత్య వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అంటూ ఆమె నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు తాము ఆందోళన విరమించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లో ఎక్కిస్తుండగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. అక్రమ వెంచర్లను కూల్చడానికి హైడ్రా, రంగనాథ్ రావాలని వారు డిమాండ్ చేశారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది.

### రాజ్యసభ రేసులో

# ఆ 16 మంది...

## పీసీసీ చీఫ్ కీలక ప్రకటన

### ఎమ్మెల్యేలు సహకరించడం లేదని
### రాహుల్ కు 8 మంది డీసీసీల ఫిర్యాదు

**హైదరాబాద్, మహా:**

తెలంగాణలో ఖాళీ అయిన రెండు రాజ్యసభ సీట్లకోసం కాంగ్రెస్ లో 16 మంది రేసులో ఉన్నారని టిపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రాజ్యసభ సభ్యుల ఎంపిక కోసం ఢిల్లీ పిలిచే అవకాశం ఉందన్న ఆయన ఢిల్లీకి పిలుస్తామా లేక ఫోన్లో చర్చిస్తామా అనేది సాయంత్రం వెల్లడిస్తామన్నారు. గాంధీభవన్ లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన పలు విషయాలు వెల్లడించారు. రాజ్యసభ సభ్యుల ఎంపిక గురించి నిన్న 30 నిమిషాల చర్చ జరిగిందన్న ఆయన అధిష్టానానికి సామాజిక వర్గాల వారిగా 16 మంది పేర్లను ఇచ్చామన్నారు. అయితే సమర్ధవంతమైన బీసీలు నలుగురు రాజ్యసభ అవకాశం ఇవ్వమని అడుగుతున్నారన్నారు. రాష్ట్రం నుండి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా? అనేది బుధవారం తెలుస్తుందన్న ఆయన జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానాన్ని అడగడం లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చింది. తెలంగాణ కోసం పని చేసిన వాళ్ళలో ఒక్కరికైనా బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశం ఇచ్చిందా? మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కార్పొరేషన్ పదవులపై కసరత్తు జరుగుతోందని మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు



ఇస్తామని ప్రకటించారు.

**పాకిస్థాన్ తో చర్చలు జరుపుతారు కానీ మావోలతో జరపరు**

పినరయి విజయ్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి సమాధానం చెప్పారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రాజకీయాల కోసమే పినరయి విజయ్ మాట్లాడుతున్నాడని ఆరోపించారు. కేరళలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

మిగతా 2లో

## వెల్ డన్ మహేష్

పీసీసీ చీఫ్ పై రాహుల్ ప్రశంసలు
2లో

## కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

సింఘ్వీకి రెన్యువల్.. అనూహ్యంగా పుంజాల వినయ్?
2లో

### ఇసుక, మైనింగ్ మాఫియా పట్ల

# కఠినంగా ఉండండి

### లేదంటే ఎస్పీ, కలెక్టర్లను సస్పెండ్ చేస్తాం...

నెలలో పదిరోజులు కలెక్టర్లు గ్రామాల్లో పర్యటించాలి

మంచిచేస్తే అభినందిస్తాం.. మీ పనితీరు బేరీజు వేస్తాం



99 రోజుల ప్రణాళికపై కలెక్టర్లకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్ శివారుప్రాంతాల కలెక్టర్ల తీరుపై గుర్రు

**హైదరాబాద్, మహా**

ఇసుక, మైనింగ్ మాఫియా పట్ల కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే ఎస్పీ, కలెక్టర్లను సస్పెండ్ చేస్తాం. ఈ ప్రభుత్వం కలెక్టర్లను నిశితంగా గమనిస్తోంది. మంచి పనులు చేస్తే అభినందిస్తాం. వార్షిక పర్ఫార్మెన్స్ ఆధారంగా అందరి పనితీరును తెలుసుకుంటాం. జూన్ లో కలెక్టర్ల పనితీరుపై మరోసారి మీటింగ్ నిర్వహిస్తాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆషామాషీగా ఐఏఎస్ కాలేదని, ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే ఆ ఉద్యోగానికి సార్ధకత ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తేనే కలెక్టర్లుగా కొనసాగుతారన్నారు. కలెక్టర్లుగా క్షేత్రస్థాయిలో పర్యటించకపోతే ఎప్పటికీ మీకు ప్రజల సమస్యలు అర్థం కావన్నారు. కనీసం నెలకు 10 రోజులైనా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశిస్తున్నానన్నారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులేనన్నారు. కలెక్టర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలన్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని, గ్రామాలవారీగా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు,లబ్ధిదారుల వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయన్నారు. ప్రతీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం ఒక అధికారికి బాధ్యత ఇవ్వాలని, ఆ అధికారి విద్యార్థులతో పాటు పాఠశాలలో భోజనం చేయాల్సిందేనన్నారు. కలెక్టర్లు వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయాలని, ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం సహించదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. వంద నియోజకవర్గాల్లో.. నియోజకవర్గానికి ఒక మండల కేంద్రంలో నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నామని, ఆరుట్ల తరహాలో అన్ని రకాల వసతులతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. భవిష్యత్ లో అన్ని మెడికల్ కాలేజీలతో ప్రభుత్వ హాస్పిటల్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని భావిస్తున్నాం. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. బోగస్ ఉద్యోగులను సృష్టించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల విషయంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కఠిన చర్యలు ఉంటాయి. మిల్లర్ల దగ్గర నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదే. మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కలెక్టర్లు కఠినంగా వ్యవహరించాల్సిందే నని సీఎం సూచించారు. సమావేశంలో సీఎస్ రామక్రిష్ణారావు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి, సీతక్క, కొండా సురేఖ ఇతర మంత్రులు పాల్గొన్నారు.

Scan here.
Step Forward. Get Recognized. Be Celebrated.

# రగులుతున్న పశ్చిమాసియా

మహా నెట్ వర్క్





పశ్చిమాసియా రగులుతోంది. యుద్ధ జ్వాలలు సోమవారం మరింత తీవ్రరూపు దాల్చాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాల సైనిక చర్య ఉద్ధృతంగా సాగుతోంది. లెబనాన్ నుంచి తమపై దాడికి తెగబడిన హెజ్బొల్లాపైనా ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. అటు ఇరాన్, దాని మిత్రదేశాలు, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాల్లోని చమురు శుద్ధి కేంద్రాలపై దాడికి దిగాయి. ఈ దాడుల తీవ్రత పెరుగుతుండగా యుద్ధం నుంచి బయటపడే స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం వంటి అంశాలు సుదీర్ఘ పోరాటానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య మరికొన్ని వారాలు కొనసాగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు ఇరాన్ ఓవైపు అధ్యక్షుడిని కోల్పోయినా పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తోంది. లెబనాన్‌పై ఇరాన్ దాడి చేయగా, ఇప్పటి వరకు 40 మంది మృతి చెందారు. 246 మందికి గాయాలయ్యాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర ప్రతీకారదాడులు జరుపుతోంది. సెంట్రల్ ఇజ్రాయెల్‌ను ఇరాన్ క్షిపణులు తాకాయి. ఇరాన్ క్షిపణులు దూసుకొచ్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు ఇరాన్‌లోని సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో ఇరాన్‌లోని నటాంజ్ అణు శుద్ధి కేంద్రంపై దాడి జరిగినట్టు ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. తాజాగా ఈ దాడిని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ ధ్రువీకరించింది.

**ఇరాన్‌పై యూఏఈ, బహ్రెయిన్ ఎటాక్**

ఇరాన్ 186 క్షిపణులు, 812 డ్రోన్లు ప్రయోగించినట్లు యూఏఈ రక్షణశాఖ ప్రకటించింది. ఇరాన్ ప్రయోగించిన 172 క్షిపణులను ధ్వంసం చేసినట్లు యూఏఈ వెల్లడించింది.

**హర్మూజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్**

పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం రోజురోజుకూ తీవ్రమవుతోంది. పరస్పర దాడులతో ఉద్రిక్తత పరిస్థితులు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ ఇంధనానికి జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా ఆ మార్గం గుండా ఏ నౌకైనా వెళ్లడానికి ప్రయత్నిస్తే తగలబెడతామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్, నౌకాదళ సిబ్బంది ఆ పని చేస్తారని ఇరాన్ హెచ్చరించింది. దీంతో సుమారు 700 ఆయిల్ ట్యాంకర్లు జలసంధికి ఇరువైపులా నిలిచిపోయాయి. తాజా పరిణామాలతో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాన్ని పేల్చేసిన ఇరాన్**

బహ్రెయిన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై ఇరాన్ మరోసారి భీకర దాడులు చేసిందంటూ ఖతర్ మీడియా సంస్థ అల్ జజీరా సంచలన కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం, మంగళవారం తెల్లవారుజామున బహ్రెయిన్ దేశంలోని అమెరికా వైమానిక స్థావరానికి చెందిన ప్రధానమైన కమాండ్ కంట్రోల్ భవనాన్ని పేల్చేశామని ఇరాన్ ఐఆర్‌జీసీ ప్రకటించింది. 20 డ్రోన్లు, 3 మిస్సైళ్లతో షేక్ ఈసా బేస్‌పై దాడి చేశామని తెలిపింది. సముద్ర జలాల్లో పలు ముడి చమురు ట్యాంకర్లకూ నిప్పు పెట్టామని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా ఇజ్రాయెల్ దాడులు కొనసాగినన్ని నాళ్లు, ఇరాన్ బలంగా ప్రతిఘటిస్తూనే ఉంటుందని ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ రాయబారి అమీర్ సయ్యిద్ ఇరావని తేల్చి చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌లోని రమత్ డేవిడ్ వైమానిక స్థావరంపై లెబనాన్‌లోని హిజ్బుల్లా మిలిటెంట్లు డ్రోన్లతో ఎటాక్స్ చేశారు. పెద్దసంఖ్యలో డ్రోన్లు ఈ వైమానిక స్థావరంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్లపై పడ్డాయంటూ అల్ జజీరా కథనాన్ని ప్రచురించింది. సోమవారం లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడులకు ప్రతిగా, హిజ్బుల్లా ఈ ఎటాక్స్ చేసిందని పేర్కొంది.

**సౌదీ, బహ్రెయిన్, జోర్డాన్‌లలో అమెరికా అడ్వైజరీలు**

సైనిక ఘర్షణ తీవ్రరూపు దాలుస్తున్న వేళ సౌదీ అరేబియా, బహ్రెయిన్, జోర్డాన్‌లలో అమెరికా ముఖ్యమైన అడ్వైజరీలను జారీ చేసింది. బహ్రెయిన్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక స్థావరాల్లో ఉన్న నాన్ ఎమర్జెన్సీ విభాగాల సిబ్బంది, వారి కుటుంబాలు వెంటనే స్వదేశానికి వచ్చేయాలని అమెరికా విదేశాంగ శాఖ ఆదేశించింది. వారి భద్రతకు ముప్పు ఉన్నందునే ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని తెలిపింది. యావత్ మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఉన్న అమెరికన్లు కూడా స్వదేశానికి తిరిగి వచ్చేయాలని అమెరికా విదేశాంగ శాఖ పిలుపునిచ్చింది. అమెరికా ఎంబసీలపైనా ఇరాన్ దాడులు చేస్తున్నందున, కొంతకాలం పాటు ఎంబసీకి రావొద్దని అమెరికా పౌరులకు సౌదీ అరేబియాలోని అమెరికా ఎంబసీ సూచించింది.

**ఇప్పటికే చాలా లేట్.. చర్చల్లేవ్.. - ట్రంప్ సంచలనం**

ఇరాన్‌తో సైనిక ఘర్షణ తీవ్రరూపు దాలుస్తున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. అమెరికాతో మళ్లీ చర్చలను ప్రారంభించే విషయంలో ఇరాన్ బాగా ఆలస్యం చేసిందన్నారు. నాయకత్వాన్ని, గగనతల రక్షణ వ్యవస్థను, వాయుసేనను, నౌకాదళాన్ని కోల్పోయాక చర్చల గురించి ఇరాన్ మాట్లాడుతోందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిపోయిందని పేర్కొన్నారు. ఈమేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్ట్ పెట్టారు.

**దాడులను తిప్పికొడతాం- ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్**


యుద్ధ పరిస్థితుల్లోనూ దేశం ధైర్యంగా నిలిచింది. యుద్ధం జరుగుతున్నా పరిపాలనపై పట్టు సడలలేదు. ప్రభుత్వ యంత్రాంగం అద్భుతంగా పనిచేస్తోంది. ప్రావిన్స్ గవర్నర్లతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి' అని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తెలిపారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులను తిప్పికొడతామని, ప్రతిదాడులను కొనసాగిస్తామని చెప్పారు.


**ఇరాన్ అధ్యక్ష కార్యాలయంపై దాడి**


ఇరాన్ రాజధాని నగరం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. సోమవారం రాత్రి పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతో టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న పలు కీలక ప్రాంగణాలపై దాడులు జరిపామని, అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై బాంబులు జారవిడిచామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తెలిపింది. ఇదే ఏరియాలోని ఇరాన్ మిలటరీ అధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థపైన, ఇతర మౌలిక సదుపాయాలపైన కూడా దాడి చేసినట్టు చెప్పింది.

**ఇరాన్ సుప్రీం ఎన్నిక జరుగుతుండగా..**

ఇరాన్ నగరం కోమ్ లోని ఇరాన్ సుప్రీం నేతను ఎన్నుకునే 'కౌన్సిల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' భవనంపై ఇజ్రాయెల్ మంగళవారంనాడు గగనతల దాడులు జరిపింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ డిఫెన్స్ అధికారులు ధ్రువీకరించారు. ఇరాన్ సుప్రీం నేతను ఎన్నుకునే బాధ్యత కౌన్సిల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ పైనే ఉంటుంది. శనివారంనాటి దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆయన వారసుడి ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఖమేనీ వారసుడిని ఎన్నుకునేందుకు ఓటింగ్ జరిపి, వాటిని లెక్కిస్తుండగా ఇజ్రాయెల్ సంచలన దాడి చేసింది. ఆ సమయంలో కౌన్సిల్‌లోని 88 మంది సభ్యులలో ఎంతమంది హాజరయ్యారు, ఏమేరకు నష్టం జరిగిందనేది వెంటనే తెలియలేదు. 'కొత్త సుప్రీం నేతను ఎన్నుకోకుండా నిరోధించాలని మేము కోరుకుంటున్నాం' అని తాజా దాడుల ఉద్దేశాన్ని ఇజ్రాయెల్ అధికారి ఒకరు తెలిపారు.







## రాజ్యసభ రేసులో ఆ 16 మంది...

(మొదటిపేజీ తరువాయి)

నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పని చేశారన్నారు. ఆపరేషన్ కగార్ ను మేం వ్యతిరేకించామని చెప్పిన మహేష్ కుమార్ పాకిస్థాన్ తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని ఎద్దేవా చేశారు. మావోయిస్టు సిద్ధాంతంతో మాకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయని కానీ, ప్రజల కోసం పోరాడిన వాళ్లపై గౌరవం ఉంటుందన్నారు.మేమయినా, మావోయిస్టులు అయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే ఆహ్వానం పలుకుతామన్నారు. మేం ఎవరిని అడగలేదని స్పష్టం చేశారు.

**డీసీసీ అధ్యక్షులకు ఎమ్మెల్యేలు సహకరించడం లేదు**

కొందరు డీసీసీ అధ్యకులు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశారని, 8 చోట్ల ఎమ్మెల్యేలు సహకరించడం లేదని డీసీసీ అధ్యక్షులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ అంశంపై దృష్టి పెట్టమని రాహుల్ గాంధీ తనను ఆదేశించారని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యేలతో మాట్లాడినట్లు పీసీసీ చీఫ్ వెల్లడించారు. అమాయకుడైన రాహుల్ గాంధీని బీజేపీ నాయకులు ఆడిపోసుకున్నారని, మోదీ ఎప్‌స్టీన్ ఫైల్స్ లో అడ్డంగా దొరికిపోయాడన్నారు. మోదీ వ్యవహారంపై బీజేపీ, ఆరెస్సెస్ సమాధానం చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

## వెల్ డన్ మహేష్

**పీసీసీ చీఫ్ పై రాహుల్ ప్రశంసలు**

**హైదరాబాద్, మహా :** డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. శిబిరం ముగింపు కార్యక్రమంలో మహేష్ గౌడ్ చేసిన కృషిని ప్రశంసిస్తూ "వెల్ డన్ మహేష్" అంటూ కితాబు ఇవ్వడంతో సభలో చప్పట్ల వర్షం కురిసింది. డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం నిర్వహణలో మహేష్ గౌడ్ స్వయంగా పాల్గొని, పది రోజుల పాటు అన్ని కార్యక్రమాలను సమన్వయం చేస్తూ దగ్గరుండి పర్యవేక్షించిన విధానం పార్టీ శ్రేణుల్లో స్ఫూర్తి నింపింది. శిబిరం ప్రతి రోజు కార్యక్రమాల రూపకల్పన నుంచి అమలు వరకు ఆయన చూపిన పట్టుదల, క్రమశిక్షణ నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది. ముగింపు కార్యక్రమం సందర్భంగా "సంఘటన సృజన్" ప్రోగ్రామ్ చైర్మన్ సచిన్ రావ్ మాట్లాడుతూ, మహేష్ పది రోజుల పాటు పూర్తిగా శిబిరానికి హాజరై ప్రతి సెషన్‌ను సమర్థంగా నిర్వహించారు" అని ప్రశంసించారు. వెంటనే స్పందించిన రాహుల్ గాంధీ "వెల్ డన్ మహేష్" అంటూ అభినందించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ శిక్షణ శిబిరం పార్టీకి నూతన ఉత్సాహాన్ని అందించగా, రాహుల్ గాంధీ ప్రశంసలు ఆయన కృషికి మరింత గుర్తింపుగా నిలిచాయి.

## 8 మంది దేశాధినేతలకు మోదీ ఫోన్



**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ 8 మంది దేశాధినేతలకు ఫోన్లు చేశారు. గడిచిన 48 గంటల్లో 8మంది దేశాదినేతలకు మోదీ ఫోన్ చేసినట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, జోర్డాన్ , బహ్రెయిన్, ఒమన్,కువైట్, ఖతార్, దేశాధినేతలకు మోదీ ఫోన్ చేశారు. యుద్ధం నేపథ్యంలో ఫోన్‌లో భారత ప్రధాని మోదీ మాట్లాడి ఆ దేశాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

### యుద్ధంపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి
## ఇస్మాయిల్ కీలక వ్యాఖ్యలు

**మహా:**యుద్ధంపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి కీలక వ్యాఖ్యలు చేశారు. 'మేము యుద్ధం ఏనాడూ కోరుకోలేదు. అసలు యుద్ధమే మేము ప్రారంభించలేదు. ఇజ్రాయెల్ అమెరికా కలిసి తమపై యుద్ధాన్ని ప్రకటించాయి. వాళ్లే మొదలెట్టారు.. కాబట్టి వాళ్లే ఆపేయాలి. మేము ఎప్పుడూ దౌత్య మార్గమే ఎంచుకున్నాము. అమెరికా ఇజ్రాయెల్ రగిలించిన అగ్ని ఇప్పుడు ప్రపంచమంతా కమ్మేస్తోంది. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. అంతర్జాతీయ సమాజం మధ్యవర్తిత్వం వహిస్తే పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం సులభమే. మరోవైపు యూరప్ వైఖరి కూడా సరిగా లేదు. యూరల్ దేశాల నిర్లక్ష్య వైఖరి వీడాలి. దాడులను యూరప్ దేశాలు ఖండించాలి. దీనికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి బాధ్యత తీసుకోవాలి' అని ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. యుద్ధం ముగింపుకు ఎవరు చొరవతీసుకుంటారో చూడాలి.

## పెట్రో ఉత్పత్తుల ఆందోళన అవసరం లేదు

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**మహా:**అమెరికాఇరాన్ యుద్ధం నేపథ్యంలో.. అంతర్జాతీయంగా చమురు సరఫరా, భారతదేశంలో పెట్రో ఉత్పత్తుల అందుబాటుపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పశ్చిమాసియాలో అమెరికాఇరాన్ మధ్య యుద్ధం, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భారతదేశం అన్ని రకాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉంది.భారతదేశం రిఫైనరీ విషయంలో నాలుగో స్థానం, ఎగుమతుల విషయంలో ఐదో స్థానంలో ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతిలో మూడో స్థానంలో ఉన్నప్పటికీ.. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలతో భారతదేశానికి ఇప్పటికిప్పుడు వచ్చిన ఇబ్బందేమీ లేదు. దేశంలో పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం వంటి పెట్రోలియం ఉత్పత్తులు, క్రూడ్ ఆయిల్ నిల్వలు సరిపడా ఉన్నాయి అని మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో 25 రోజులకు సరిపడా క్రూడ్ ఆయిల్ స్టాక్ ఉందని కేంద్రం ప్రకటించింది.

### ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ కొత్త రక్షణ మంత్రి
## సైయద్ మాజిద్ అల్-రేజా మృతి

**మహా :** పశ్చిమాసియాలో నాలుగో రోజు కూడా దాడులు, ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అమెరికా మద్దతుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ మిసైళ్లతో విరుచుకుపడుతోంది. తాజా దాడుల్లో ఇరాన్ కొత్త రక్షణ మంత్రి సైయద్ మాజిద్ అల్‌రేజా మృతి చెందినట్టు 'ది స్పెక్టేటర్ ఇండెక్స్' వెల్లడించింది. రెండు రోజుల క్రితమే ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ సనీర్జాదే ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందాడు. దీంతో వెంటనే కొత్త రక్షణ మంత్రిగా అల్‌రేజా బాధ్యతలు చెపట్టారు. అల్ రేజా ఇంతకుముందు డిప్యూటీ రక్షణ మంత్రిగా ఉండేవారు. తాజాగా అల్‌రేజా కూడా తమ దాడుల్లో మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది.

## భారత్ యుద్ధానికి రెడీ అవుతోంది

- **పాక్ అధ్యక్షుడు జర్దారీ సంచలన ఆరోపణలు**
- **సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం 'జల ఉగ్రవాదమే**

**మహా:**భారత్ తమపై మరో యుద్ధానికి సన్నాహాలు చేస్తోందని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ సంచలన ఆరోపణలు చేశారు. సరిహద్దుల్లో భారత సైనిక కదలికలు భారీగా పెరిగాయని, ఈ పరిణామాలు ప్రాంతీయ శాంతికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో జర్దారీ ప్రసంగించారు. సింధు నదీ జలాల ఒప్పందం నుంచి భారత్ ఏకపక్షంగా వైదొలగడాన్ని జర్దారీ తీవ్రంగా తప్పుబట్టారు. దీన్ని ఆయన 'జల ఉగ్రవాదం' (హైడ్రో టెర్రరిజం)గా అభివర్ణించారు. "భారత్ నీటిని ఒక ఆయుధంగా మార్చి, పాకిస్థాన్ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయాలని చూస్తోంది. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే" అని ఆయన ఆరోపించారు. కశ్మీర్ సమస్యకు పరిష్కారం లభించనంత వరకు దక్షిణాసియాలో శాంతి ఒక కలగానే మిగిలిపోతుందని జర్దారీ పునరుద్ఘాటించారు. యుద్ధ క్షేత్రం నుంచి వైదొలగి, చర్చల వేదికపైకి రావాలని భారత్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో, అఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వానికి కూడా జర్దారీ హెచ్చరికలు జారీ చేశారు. పాక్‌పై దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాద సంస్థలను అణచివేయాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే సరిహద్దుల్లో 'ఘజబ్ లిల్ హక్' పేరుతో సైనిక ఆపరేషన్ కొనసాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. అయితే, పాకిస్థాన్ ఆరోపణలను భారత్ మొదటి నుంచీ ఖండిస్తోంది. సీమాంతర ఉగ్రవాదం ఆగే వరకు ఎలాంటి చర్చలకు ఆస్కారం లేదని న్యూఢిల్లీ తేల్చిచెప్పింది. గతేడాది పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్ తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. ఉగ్రవాదాన్ని అరికట్టే వ్యూహాత్మక ఒత్తిడిలో భాగంగానే సింధు జలాల ఒప్పందంపై భారత్ నిర్ణయం తీసుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## ప్రధాని సీటు ఖాళీ కాదు

**రాహుల్ ఆశలు వదులుకోవడమే బెటర్**
**కేంద్రమంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, మహా :** రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకేతాలు ఇవ్వడం దేశంపై ఒక గ్రహణంలాంటిదేనని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌విమర్శలు చేశారు. ప్రధానమంత్రి కుర్చీ అనేది కుటుంబ వారసత్వం కాదని, ఒక చిరునవ్వు, ఒక తలాడింపుతో బహుమతిగా ఇచ్చేది కాదని పేర్కొన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ 'రాహుల్ గ్రహణం' మూడుసార్లు భారతాన్ని చీకటిలో ముంచేందుకు ప్రయత్నించిందని, ప్రధాని మోదీ అభివృద్ధి కిరణాలు ప్రతీసారి వెలుగునిచ్చి దేశాన్ని కాపాడాయని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యమని నిజాం శైలి దర్బార్ కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలుసు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కాలేరని, ఇప్పటికైనా ఆయన భజన ఆపి, పరిపాలనపై దృష్టి పెట్టాలని సూచించారు.

### ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ కొత్త రక్షణ మంత్రి సైయద్ మాజిద్ అల్-రేజా మృతి

మహా : పశ్చిమాసియాలో నాలుగో రోజు కూడా దాడులు, ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అమెరికా మద్దతుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ మిసైళ్లతో విరుచుకుపడుతోంది. తాజా దాడుల్లో ఇరాన్ కొత్త రక్షణ మంత్రి సైయద్ మాజిద్ అల్‌రేజా మృతి చెందినట్టు 'ది స్పెక్టేటర్ ఇండెక్స్' వెల్లడించింది. రెండు రోజుల క్రితమే ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ సనీర్జాదే ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందాడు. దీంతో వెంటనే కొత్త రక్షణ మంత్రిగా అల్‌రేజా బాధ్యతలు చెపట్టారు. అల్ రేజా ఇంతకుముందు డిప్యూటీ రక్షణ మంత్రిగా ఉండేవారు. తాజాగా అల్‌రేజా కూడా తమ దాడుల్లో మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది.

## భారతీయ క్రియేటర్ల శ్రమను దోచుకుంటున్నారు

- **విజయసాయిరెడ్డి ఫైర్**
- **ఇన్‌స్టాగ్రామ్ ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని మండిపాటు**
- **మనకు ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉండాలని వ్యాఖ్య**



**హైదరాబాద్, మహా:**సోషల్ మీడియా వేదికలపై రాత్రింబవళ్లు శ్రమించి కంటెంట్‌ను సృష్టిస్తున్న భారతీయ క్రియేటర్లకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారతీయుల ప్రతిభను తక్కువ ధరకు వాడుకుంటూ, ప్రకటనల ద్వారా వచ్చే భారీ ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకుంటున్నాయని మండిపడ్డారు. యూట్యూబ్ వంటి సంస్థలు ప్రకటనల ఆదాయంలో 55 శాతం క్రియేటర్లకు ఇస్తుండగా, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు క్రియేటర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విదేశీ సంస్థలు తమ ధోరణిని మార్చుకోని పక్షంలో, భారతదేశానికే సొంతంగా ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఉండాలని ఆయన ప్రతిపాదించారు. 'భారత్ టాక్సీ' లాంటి స్వదేశీ ప్రత్యామ్నాయాల మాదిరి, ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉంటే మన దేశ సంపద విదేశాలకు పోకుండా ఉండటమే కాకుండా, క్రియేటర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని విజయసాయి రెడ్డి కోరారు. గతంలో అశ్వినీ వైష్ణవ్ క్రియేటర్ల పక్షాన మాట్లాడిన విషయాన్ని గుర్తుచేస్తూ, వారి ఆర్థిక భద్రత, హక్కుల కోసం కఠినమైన చట్టబద్ధ నిబంధనలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ క్రియేటర్ల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వ రంగంలో లేదా స్వదేశీ భాగస్వామ్యంతో కొత్త ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియాలో క్రియేటర్లే వెన్నెముక అని, వారి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్ చేరుకున్న విమానం

**మహా :**ఒమన్ ఎయిర్‌వేస్ విమానం మంగళవారం హైదరాబాద్ వచ్చింది. మస్కట్ నుంచి శంషాబాద్ విమానం చేరుకోగా, ఇందుకలో 40మంది సురక్షితంగా వచ్చారు. టికెట్ ధరలు అధికంగా ఉన్నాయని ప్రయాణికులు తెలిపారు. ఒమన్ ఎయిర్‌వేస్ విమానాలు మాత్రమే నడుస్తున్నాయి.



## ఇరాన్‌లో ఉద్రిక్తతలు.. ప్రధాని మౌనాన్ని వీడాలి

**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**

**మహా:**ఇరాన్ అధినేత అయతుల్లా ఖమేనీ మరణంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనాన్ని వీడాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇలాంటి పరిణామాలను ఖండిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని స్పష్టంగా చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్షంగా జరుగుతున్న దాడులు, గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులను ఖండించాలని స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో మౌనం దాలిస్తే ప్రపంచంలో భారత్ స్థాయి దిగజారే అవకాశం ఉందని అన్నారు.

## కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

**సింఘ్వీకి రెన్యువల్..**
**అనూహ్యంగా పుంజాల వినయ్?**

**హైదరాబాద్, మహా:**తెలంగాణ రాజ్యసభ ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులపై స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది . ఇప్పటికే ఒక స్థానానికి సీనియర్ నాయకులు అభిషేక్ మను సింఘ్వీ పేరు ఖాయం కాగా, రెండో అభ్యర్థిగా డాక్టర్ పుంజాల వినయ్ కుమార్ ను అధిష్టానం ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది . వీరిద్దరి పేర్లను హైకమాండ్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. సామాజిక సమీకరణాలు, పార్టీ పట్ల విధేయత, రాజకీయ కారణాలను దృష్టిలో పెట్టుకొని డాక్టర్ వినయ్ కుమార్‌కు కాంగ్రెస్ హైకమాండ్ ఈ అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఖరారు కాలేదని, బుధవారం సీఎం, పీసీసీ చీఫ్ ఢిల్లీ పర్యటనలో ఖరారవుతుందని నేతలు భావిస్తున్నారు. వీహెచ్, వేం నరేందర్ రెడ్డి తో పాటు అనేక మంది రేసులో ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులతో మేయర్ దంపతుల హోలీ సంబరాలు



**నల్లగొండ మహా :** రంగుల పండుగ హోలీ వేడుకలు నల్లగొండ పట్టణంలో అంబరాన్నంటాయి. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన వేడుకల్లో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి దంపతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా పట్టణాన్ని శుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మేయర్ దంపతులు రంగులు పూసుకుని వేడుకలు జరుపుకోవడం విశేషం.పండుగ పూట కూడా విధుల్లో నిమగ్నమైన పారిశుద్ధ్య కార్మికుల వద్దకు మేయర్ స్వయంగా వెళ్లారు. ఈ సందర్భంగా కార్మికులు మేయర్‌కు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికులతో కలిసి సరదాగా గడిపిన మేయర్ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.మేయర్ నివాసానికి చేరుకున్న పిఆర్‌టియు (PRTU) నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరియు స్థానిక డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

### వి.బి.జీ రాంజీ బిల్లును రద్దు చేయాలి..వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ డిమాండ్

**సత్తుపల్లి, :మహా:**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రేజర్ల గ్రామంలోని ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాన్ని జాజిరి శ్రీనివాస్ సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మూడు వారాల నుండి పని డబ్బులు రావడం లేదని వారానికి ఒక్కసారి తమకు కూలి డబ్బులు వచ్చే విధంగా సహకరించాలని జాజిరి శ్రీనివాసరావు కోరారు. ఈ విషయంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వి.బి.జి రామ్ జీ పథకం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ పథకం పూర్తిగా పేదలకు వ్యతిరేకమని, వ్యవసాయ కార్మికుల పని హక్కును కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. వి.బి.జీ రాంజీ నిధులు వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం భరించాలని నిర్ణయించడం వలన రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వాటా భరించే పరిస్థితుల్లో లేవన్నారు. పని దినాలు వంద రోజుల నుండి 125 రోజుల వరకు పెంచామని కేంద్ర ప్రభుత్వం గొప్పగా చెబుతున్న వి.బి.జి రామ్ జీ పథకంలోని నిబంధన ప్రకారం పేదలకు పని కల్పించే పరిస్థితి లేదన్నారు. పని ప్రదేశాలలో కూలీలకు మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, నీడ కోసం టెంటు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉదయం, సాయంత్రం ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, కారు మంచి శ్రీలక్ష్మి, గద్దల సువార్త, మొండ్రు పార్వతి, పారంపూడి అపర్ణ, మిక్కిలి శ్యామల రావు, గద్దల వెంకటేశ్వరరావు, ఎస్, నిర్మల, కొత్తపెల్లి సత్యం, వీరంకి సూరయ్య పాల్గొన్నారు.



## మణుగూరులో హోలీ సందడి..


### ఐక్యతకు ప్రతీకగా రంగుల పండుగల వేడుకలు



**మణుగూరు, మహా :**రంగుల పండుగ హోలీ సందర్భంగా మణుగూరు భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉత్సాహభరిత వాతావరణంలో కార్మికులు, నాయకులు పరస్పరం రంగులు చల్లి ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే మణుగూరు మండల భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు తనుగుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గోగినేని వరలక్ష్మి, సీనియర్ నాయకుడు బొజ్జా త్రిమూర్తులు, భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసు మాట్లాడుతూ.. హోలీ పండుగ అనేది వసంత ఋతువుకు స్వాగతం పలుకుతూ సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా జరుపుకునే రంగుల పండుగ. భేదాభిప్రాయాలను పక్కనబెట్టి పరస్పరం ప్రేమాభిమానాలతో కలిసే సందర్భంగా హోలీ ప్రత్యేకతను చాటుకుంది. ఈ సందర్భంగా నాయకులు కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వీరితోపాటు ముత్యాలమ్మ నగర్, ఆదర్శనగర్, నేతాజీ వాకర్స్ సభ్యులు, పిన్నమనేని హేమంతరావుల ఆధ్వర్యంలో హోలీ పండగను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించుకున్నారు. టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రంగుల పండుగను ఉత్సాహంగా నిర్వహించుకొని ఒకరికొకరు రంగులు పూసుకున్నారు.

## గోదావరిలో స్నానానికి వెళ్లి నదిలో ఇద్దరు గల్లంతు


### హోలీ సందర్భంగా విషాదం



**మణుగూరు, మహా :**హోలీ పండుగ నేపథ్యంలో గోదావరిలో స్నానానికి దిగిన ఇద్దరు వ్యక్తులు గల్లంతైన ఘటన మణుగూరు మండలంలో విషాదాన్ని నింపింది.మణుగూరు పట్టణంలోని మల్లెపల్లి సింగరేణి వాటర్ ట్యాంక్ సమీప గోదావరి ప్రవాహంలో మంగళవారం స్నానానికి దిగిన గుండి నాగేశ్వరరావు (40), పద్దం ప్రసాద్ (35) అదృశ్యమయ్యారని స్థానికుల తెలిపారు. పద్దం ప్రసాద్ సింగరేణి ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఇద్దరూ మణుగూరు మండలం పద్మగూడెం గ్రామానికి చెందిన వారని సమాచారం. హోలీ పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి గోదావరిలోకి దిగిన వారు ఒక్కసారిగా లోతులోకి వెళ్లి కనిపించకుండా పోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే మణుగూరు ఎస్సై శ్రావణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికులు, పోలీసులు కలిసి గోదావరిలో విస్తృతంగా వెతుకులాట కొనసాగిస్తున్నారు.ఈ ఘటనతో పద్మగూడెం గ్రామంలో విషాదం నెలకొంది. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ పార్టీ నాగబాబు ఎస్సై శ్రావణ్ కుమార్ తో కలిసి నాటు పొడవ పై గల్లంతయిన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలో పాల్గొన్నారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా సిఐ నాగబాబు పేర్కొన్నారు.

## బ్యాంకు సొమ్ము కాజేసిన దొంగలు దర్జాగా ఉన్నారు...

- సంబంధం లేని గ్రూప్ సభ్యులకు నోటీసులు
- స్వరాజ్ గ్రూప్ సభ్యులకు బ్యాంకు నోటీసులు
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న సభ్యులు



NOTICE
TELANGANA GRAMEENA BANK
KAREPALLI-BRANCH

TO,
[illegible]
R/O MOTLAGUDEM
SINGARENI MD
KHAMMAM DT

SHG A/C NO..73146688588

DATE.. 27.02.2026

M/s SWARAJ SHG మహిళా సంఘం ఋణము RS.4,30,626/-చెల్లింపు కొరకు నోటీసు:-

అమ్మా,

మీ యొక్క అవసరార్థం పైన తెలిపిన మహిళా సంఘము ద్వారా RS. 7,50,000/- ఋణము తేది.31.08.2018. న మీరు మా గ్రామీణ బ్యాంక్ నుండి పొంది వున్నారు.

మీ యొక్క ఋణము సకాలములో నెల నెలా వాయిదాల పద్ధతిలో చెల్లించడం లేదు. ఈ విషయము నందు మీరు ఎట్టి శ్రద్ధను వహించలేదు. మీరు చెల్లించవలసిన మీ యొక్క గ్రూపు ఋణము బకాయి RS..4,30,626/- + INT చెల్లించవలసివున్నది. ఈ మొత్తమును వడ్డీతో సహా, కలిపి 15. రోజులలోపు బ్యాంక్ కు వచ్చి చెల్లించగలరు.

[illegible]

ఈ నోటీసుకు అగు తపాల ఖర్చు RS. 60/- రూపాయలు మీ ఖాతాకు ఖర్చు వ్రాయబడుచున్నది తెలియపరుచున్నాము.

ఈ నోటీసు అందిన వెంటనే బ్యాంక్ కు వచ్చి అమౌంట్ చెల్లించండి.

ఇట్లు,
మీ శ్రేయోభిలాషి
బ్రాంచ్ మేనేజర్
తెలంగాణ గ్రామీణ బ్యాంక్,
కారేపల్లి -507122,
సెల్ నెం:-8331010456.

**కారేపల్లి, మహా:**బ్యాంకు లింకేజీ రుణం పేరుతో అక్రమంగా బ్యాంకు సొమ్మును కాజేసిన దొంగలు దర్జాగా తిరుగుతున్నారు... ఆరుణంతో ఏ మాత్రం సంబంధం లేని గ్రూప్ సభ్యులైన మహిళలకు బ్యాంకు నోటీసులు పంపించి వారిని మానసిక ఆందోళనకు గురి చేసేలా వ్యవహరించిన బ్యాంక్ అధికారులు తీరుపై మహిళలు మండిపడుతున్నారు. మోట్లగూడెం గ్రామానికి చెందిన ఐకెపి అక్రమాన్ని మహా వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చినా అధికారులు మాత్రం అక్రమార్కులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కారేపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నుంచి స్వరాజ్ గ్రూపుకు సంబంధించిన సభ్యులకు మంగళవారం నోటీసులు పోస్ట్ ద్వారా వచ్చాయి. ఆ నోటీసుల్లో బ్యాంకుకు బకాయి పడ్డ రూ .4.50లక్షల రూపాయల సొమ్మును చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

**గ్రామానికి సంబంధం లేని ముగ్గురి పేర్లతో...**

స్వరాజ్ గ్రూపులో గ్రామానికి సంబంధం లేని ముగ్గురు మహిళలను గ్రూపులో చేర్చి నిబంధనలకు విరుద్ధంగా ఆ ముగ్గురి పేర్లతో బ్యాంకు లింకేజీ రుణం తీసుకుని అప్పటి బుక్ కీపర్, గ్రామ దీపిక, సీసీ, బ్యాంక్ మేనేజర్ కలసి కాజేశారని ఆరోపణలు ఉన్నాయి. గ్రూపులో ఉన్న మిగతా పదిమంది సభ్యులు మేము రుణం కోసం బ్యాంకు లోకే వెళ్లలేదు బ్యాంక్ అధికారులు చెప్పే ఆ లోన్ కు మాకు సంబంధం లేదని మహిళలంతా మొత్తుకుంటున్నా వారి గోడు వినిపించుకోవడం లేదు.

**అక్రమంగా లోన్ మంజూరు చేసిన బ్యాంకు మేనేజర్ పై చర్యలు ఏవీ..?**

నిబంధనలకు విరుద్ధంగా మోట్లగూడెం గ్రామానికి ఏ మాత్రం సంబంధం లేని ముగ్గురి పేర్లతో అక్రమంగా లోన్ మంజూరు చేసిన అప్పటి బ్యాంక్ అధికారి పై గ్రామీణ బ్యాంకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా లోన్ తో సంబంధం లేని సభ్యులకు నోటీసులు పంపడమేంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రూప్ సభ్యులు అందరూ బ్యాంకుకు రాకుండా బ్యాంకు లింకేజీ లోన్ ఎలా మంజూరి చేశారని ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు సొమ్ము ను ఉద్దేశపూర్వకంగా కాజేసిన వ్యక్తులను అధికారులు కాపాడే ప్రయత్నం చేయడమేంటని, అక్రమం జరిగిందని తేటతెల్లమైనా చేతులు దులుపుకునే పనులు ఎందుకు చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు...**

అక్రమంగా బ్యాంకు లింకేజీ రుణం పొంది చీటింగ్ కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రూప్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.. బ్యాంక్ అధికారులు, ఐకెపి అధికారులు వారి సిబ్బందిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు కాబట్టి పోలీస్ అధికారులు విచారణ చేపడితేనే అక్రమార్కులపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.




## ఊరువాడ హోలీ సంబరాలు



**బూర్గంపహాడ్ మహా :** హోలీ సందర్భంగా మంగళవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఊరువాడ హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ మేడ ప్రసాద్, అదనపు ఎస్ఐ నాగబిక్షం, ట్రైనీ ఎస్ ఐ సింగ్ పోలీస్ కానిస్టేబుల్ మహిళా సిబ్బంది తదితరులు హోలీ వేడుకలు కుటుంబ సభ్యులతో రంగులు చల్లుకుంటూ ఆనందంగా జరుపుకున్నారు.గ్రామాల్లో యువత చిన్న పిల్లలు రంగులు చల్లుకుంటూ కేరింతలతో ఆనందంగా హోలీ జరుపుకున్నారు. సారపాక ప్రధాన కూడలిలో యువత పెద్ద ఎత్తున పాల్గొని హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. గ్రామాల్లో, పలువురు మహిళలు నృత్యాలు చేస్తూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల నడుమ హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.

## హోలీ సంబరాల్లో పాల్గొన్న తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు..

### ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా అంజయ్య కు శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తల్లాడ, మహా :**తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో హోలీ పండగ సందర్భంగా తల్లాడ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా అంజయ్య మల్లవరం గ్రామంలో ఘనంగా ఇంటి దగ్గర కి వెళ్లి హోలీ పండుగ సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వైరా మార్కెట్ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్, సర్పంచులు గుర్రం శీను, కటికి కిరణ్ కుమార్,మాజీ సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మారెళ్ళ మల్లికార్జున రావు, తాళ్ల వెంకటేశ్వర్లు, కొల్లిపాక వెంకటనారాయణ, మాజీ ఉప సర్పంచ్ ఎర్రి నరసరావు పలువురు నాయకులు కలిసి భూక్య అంజయ్య కి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కారేపల్లిలో ఘనంగా హోలీ వేడుకలు



**కారేపల్లి, మహా:** కారేపల్లి శ్రీ వెంకట సాయి నగర్ లో హోలీ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున.. కామ దహనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం.. చిన్నారులు , యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని.. రంగులు పులుముకుంటూ హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో... శ్రీ వెంకట సాయి నగర్ లో అందరూ ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం, వారికి సెలవు దినం కావడంతో.. మంగళవారమే హోలీ వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో.. శ్రీ వెంకట సాయినగర్ అధ్యక్ష కార్యదర్శులు జి రాంబాబు, ఈసం భాస్కర్, చాందావత్ లక్ష్మణ్, చందాబాత్ నాగేష్, పొదెం రాజు, శంకర్, లక్ష్మణ్, రామారావు, ఈశ్వర్, నాగేశ్వరరావు, దుర్గయ్య, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీసీ అనుమతులపై వివాదం

### బూర్గంపాడులో కలప నరికివేతపై ఆరోపణలు



**బూర్గంపహాడ్ మహా :**ఐటీసీ రా మెటీరియల్స్ (కలప విభాగం) అనుమతుల వ్యవహారంలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తు చేసిన పొలం ఒకటి కాగా, అనుమతి పొందిన తర్వాత కర్ర నరికిన పొలం మరోటని బాధితుడు బూసిరెడ్డి శంకర్ రెడ్డి ఆరోపించారు.వివరాల్లోకి వెళ్తే, నాగనేని ప్రోలు శివారులో ఉన్న తన రెండు ఎకరాల పొలంలో జామాయిల్ పంట ఉందని పేర్కొంటూ సౌమ్య అనే యువతి గుత్తేదారు మద్ది బక్కారెడ్డి ద్వారా ఐటీసీ రా మెటీరియల్స్ విభాగానికి అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఆ పొలంలో జామాయిల్ పంట లేనప్పటికీ, అధికారులు పరిశీలన చేయకుండానే అనుమతి మంజూరు చేశారని ఆరోపణలు ఉన్నాయి.అనుమతి పొందిన తర్వాత జామాయిల్ కర్ర నరికింది మాత్రం సారపాక శివారు ప్రాంతంలో తనకు చెందిన పొలం నుంచేనని బూసిరెడ్డి శంకర్ రెడ్డి తెలిపారు. ఈ విషయమై గుత్తేదారు మద్ది బక్కారెడ్డిని ప్రశ్నించగా, ఐటీసీ రా మెటీరియల్స్ అధికారుల ప్రోత్సాహంతోనే వేరే పొలం నుండి కట్ చేస్తున్నానని సమాధానం ఇచ్చినట్లు చెప్పారు.ఇక, నాగినేనిప్రోలు ప్రాంతానికి చెందిన వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులతో కుమ్మక్కై కర్రను నరికి ఐటీసీకి సరఫరా చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు, కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ విషయాన్ని ఐటీసీ రా మెటీరియల్స్ అధికారిగా ఉన్న శ్రీధర్కి అలాగే జనరల్ మేనేజర్ అమిత్ సింగ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.అనుమతులు అక్రమంగా పొందిన గుత్తేదారు మద్ది బక్కారెడ్డి పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా? లేక ఇటువంటి అక్రమాలకు ప్రోత్సాహం ఇస్తారా? అన్నది ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఈ ఘటనపై ఐటీసీ అధికారులు, పోలీసుల తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.

## భద్రాచలం ఎల్ఐసిలో భారీ స్కామ్

### బతికుండగానే చంపేసి కోట్లు కొల్లగొట్టారు!

**భద్రాచలం మహా :**భద్రాచలం ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో సినీ ఫక్కీలో జరిగిన ఓ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నిరుపేదలు, అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతూ అశ్వాపురం ప్రాంతానికి చెందిన కొందరు కేటుగాళ్లు ఏకంగా రూ. 1.52 కోట్లను కాజేశారు. బతికున్న వ్యక్తులను చనిపోయినట్లుగా చిత్రీకరించి, నకిలీ పత్రాలతో క్లెయిమ్లు పొందిన ఈ ఘరానా మోసం స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది..

**మోసం జరిగిందిలా..**

అశ్వాపురం మండలానికి చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి, ఎల్ఐసి నిబంధనల్లోని లొసుగులను ఆసరాగా చేసుకున్నారు. ఎంపిక చేసిన కొంతమంది వ్యక్తుల పేరిట పాలసీలు తీసుకుని, వారు చనిపోయారంటూ తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలను () ఏజెంట్లు సృష్టించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో, ఈ కేటుగాళ్లు సులభంగా కోటిన్నర రూపాయలకు పైగా సొమ్మును డ్రా చేసుకున్నారు.

**నిద్రలేచిన అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు..**

అంతా అయిపోయి, ఖజానా ఖాళీ అయ్యాక గానీ ఎల్ఐసి బ్రాంచ్ నిర్వాహకులకు విషయం బోధపడలేదు. అంతర్గత తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడటంతో లబోదిబోమంటూ వారు పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇంత భారీ మొత్తంలో నగదు పక్కదారి పడుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు గుర్తించలేకపోయారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు భద్రాచలం బ్రాంచ్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండటంతో పాలసీదారుల్లో ఆందోళన మొదలైంది.బ్రాంచ్ అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో స్కామ్ జరగడం సాధ్యమేనా?నకిలీ పత్రాలను వెరిఫై చేయడంలో సిబ్బంది ఎందుకు విఫలమయ్యారు?

**సాధారణ ప్రజలకు క్లెయిమ్ రావాలంటే నెలల తరబడి తిప్పించే అధికారులు, ఈ కేటుగాళ్లకు ఎలా సహకరించారు?**

అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుల సొమ్ముకు భద్రత కల్పించాల్సిన సంస్థలో ఇలాంటి "ఘరానా మోసాలు" చోటుచేసుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఇకనుంచైనా అధికారులు అప్రమత్తంగా ఉంటారో మళ్లీ ఇలాంటి ఘటన పునరాలతో అవుతాయో వేచి చూడాల్సి ఉంది..?ఒక కోటి యాభై రెండు లక్షలు కాజేసిన LIC ఏజెంట్లు

**బతికున్నోళ్ల పేరుపై మరణ ధ్రువీకరణ పత్రాలు**

అశ్వాపురం మండలం సీతారాం పురానికి చెందినటువంటి ఇద్దరు ఏజెంట్లు భద్రాచలం శాఖ పరిధిలో 39 మంది ఖాతాదారుల పేరిట ఒక కోటి 52 లక్షల రూపాయలు స్వాహా చేశారు. సీతారాంపురం గ్రామానికి చెందిన ఇద్దరు ఏజెంట్లు నకిలీ పత్రాలు సృష్టించి మరణించి ఉన్న వారిపై కూడా కొన్ని కిస్తీలు పాలసీలు కట్టి తదుపరి మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి అసొమ్మును స్వాహా చేశారు. కొంతమందిని బ్రతికి ఉండగానే చంపేసి ధృవపత్రాలు సృష్టించి ఆ రకంగా కూడా స్వాహా చేశారు. అనుమానం వచ్చిన ఎల్ఐసి ఉన్నత అధికారులు నేరుగా పాలసీదారులను కలిసినప్పుడు వారు బ్రతికి ఉన్నట్టు తేలడంతో. మేనేజర్ చక్రవర్తి భద్రాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురి ఏజెంట్ల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదివాసీలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అడుగులు వేస్తున్న సారపాక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్





**బూర్గంపహాడ్ మహా :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని, మోతెపట్టి నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని రెండు గిరిజన గ్రామాలైన శ్రీరాంపురం పాయం ఎస్టి కాలనీ, చింతకుంట ఆదివాసి గిరిజన ప్రజల కష్టాలను తీర్చేందుకు ప్రజాదర్బార్లో వినతి పత్రాన్ని అందజేసిన సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్.గత 35 ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ ఆ రెండు గ్రామాల్లో జీవనం సాగిస్తున్న సుమారు 400 మంది గిరిజన ఆదివాసి కోయ జాతుల ప్రజలకు కనీస మౌలిక వసతులైన ప్రాథమిక పాఠశాల, ప్రైమరీ హెల్త్ సెంటర్, కరెంటు, మంచినీటి వసతికై మిషన్ భగీరథ పైపులైను, గ్రావెల్ రోడ్డు, ప్రతి ఇంటికి బాత్రూంలు, ఏర్పాటు చేయాలంటూ ప్రజాదర్బార్ కు వినతి పత్రాలు అందజేసిన రెండు గ్రామాల గిరిజన ఆదివాసీలు.ఆది వాసి గిరిజన ప్రజల తరఫున ప్రజా దర్బార్ కు వెళ్లిన సారపాక మేయర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శివరాం కిషోర్ నాయక్ అక్కడి సమస్యలను జిల్లా కలెక్టర్కు వివరించి మా గ్రామ పంచాయతీ తరపున అభివృద్ధి చేద్దామని మేము ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. స్థానిక ఫారెస్ట్ అధికారులు అడుగడుగునా అడ్డుపడుతున్నారని తెలియజేశారు. గత 30 సంవత్సరాల నుంచి సరైన రోడ్డు సదుపాయం లేక గర్భిణీ స్త్రీలు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఉన్నాయని కలెక్టర్కు వివరించారు. ముఖ్యంగా ఆదివాసి గిరిజన పిల్లలు చదువు బాట పట్టాలంటే ప్రాథమిక పాఠశాల తప్పనిసరి అని అలాగే కనీస వైద్య సదుపాయాన్ని అందించే విధంగా ఆ రెండు గ్రామాలకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, చీకట్లో జీవనం సాగిస్తున్న వారి గ్రామాలకు కరెంటు సదుపాయం కల్పించాలని మరియు రెండు గ్రామాలను అనుసంధానం చేసే విధంగా సుమారు 650 మీటర్లు ఉన్న గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించే విధంగా స్థానిక అటవీ శాఖ అధికారుల ఆంక్షలు తొలగించి పర్మిషన్ జారీ చేయాలని కోరిన సారపాక మేజర్ సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్.స్పందించిన కలెక్టర్ అన్ని వసతులు అందుతాయని ఆ రెండు గ్రామాల గిరిజన ఆదివాసీలకు తెలియజేశారు, అలాగే ఆ రెండు గ్రామాల ప్రజల అభివృద్ధి కి అడ్డు పడవద్దు అని ఆంక్షలు పెట్టవద్దని అటవీ అధికారులకు తెలియజేశారు.. అలాగే కొత్తగా అడవులు నరికి పోడు చేయవద్దని ఆ గ్రామ ప్రజలకు మరియు ఇప్పటికే చేసుకుంటున్న పోడు ఆక్రమించుకోవద్దని అటవీ అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేసినట్లు మీడియాకు తెలిపిన గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శివరాం నాయక్.. ఈ సందర్భంగా సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలియజేసిన చింతకుంట మరియు శ్రీరాంపురం పాయం ఎస్టి కాలనీ గిరిజన ఆదివాసీలు...

## రోడ్డుకు మోక్షం.... పనులకు శ్రీకారం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాక బసప్ప క్యాంపు లో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అంతర్గత రహదారి నిర్మాణానికి పాలకవర్గం శ్రీకారం చుట్టారు.... గత ప్రభుత్వం ఎన్నోసార్లు రోడ్డు నిర్మాణం చేస్తామని చెప్పడం జరిగింది కానీ పనులు జరగలేదు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ గూగుల్ త్ కిషోర్ నాయక్, ఉప సర్పంచ్ కన్నీదారి రమేష్, పాలకవర్గ సభ్యురాలు బాలి కనక రత్నం చొరవతో రహదారి నిర్మాణం జరుగుతుంది. రహదారి నిర్మాణం నాణ్యత ప్రమాణాలు పాటించి రహదారి నిర్మాణం చేయాలని కోరుతూ పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంత వాసులుహర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# మీ జేబులోని స్మార్ట్ ఫోన్ ఓ సైలెంట్ కిల్లరా?



సామాన్యుడి నుంచి సెలబ్రిటీల వరకు ఎవరూ సేఫ్ కాదు... ప్రపంచం నుంచి పల్లెల దాకా విస్తరిస్తున్న సైబర్ దొంగల నయా దందా!ఒక డిజిటల్ విశ్లేషకుడిగా నేను ప్రతిరోజూ ఎన్నో కేసులు చూస్తూ వుంటాను . నేను కచ్చితంగా చెప్పగలిగే ఒక చేదు నిజం ఏమిటంటే... మనం ఇప్పటికే హ్యాక్ అయ్యాం, ఆ విషయం మనకు ఇంకా తెలియదంతే..! టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ నేరాల తీరు మారుతోంది. ఒకప్పుడు దొంగతనం జరగాలంటే అర్ధరాత్రి తాళాలు పగలగొట్టాలి. కానీ, ఇప్పుడు పట్టపగలే... మన జేబులో ఉన్న స్మార్ట్ ఫోన్ ద్వారానే మన కళ్లెదుటే బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. మనం వాడే స్మార్ట్ ఫోన్ మన పాలిట సైలెంట్ కిల్లర్‌గా మారుతోంది. ఆన్‌లైన్ ప్రపంచంలో పొంచి ఉన్న ముప్పు, దాని నుంచి మిమ్మల్ని మీరు ఎలా కాపాడుకోవాలో వివరిస్తూ రాస్తున్న పూర్తిస్థాయి కథనం ఇది.

### సరిహద్దులు చెరిపేసిన సైబర్ ముప్పు

సైబర్ క్రైమ్ అనేది ఇప్పుడు లోకల్ సమస్య కాదు, గ్లోబల్ ఎమర్జెన్సీ. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకూ ఎక్కడో ఒకచోట డేటా బ్రీచ్ జరుగుతోంది. అమెరికా, బ్రిటన్ వంటి అగ్రరాజ్యాల రక్షణ వ్యవస్థలే హ్యాకర్ల చేతిలో బందీ అవుతున్నాయి. 'డార్క్ వెబ్' వేదికగా మన వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు వేలల్లో అమ్ముడవుతున్నాయి. సరిహద్దులు లేని ఈ నేర ప్రపంచంలో, రష్యాలోనో లేదా నైజీరియాలోనో కూర్చున్న ఓ సైబర్ క్రిమినల్... మన రాష్ట్రంలోని మారుమూల పల్లెటూరిలో ఉన్న సామాన్యుడి అకౌంట్ నుంచి సెకన్ల వ్యవధిలో డబ్బులు కొల్లగొడుతున్నాడు.

### *ఇండియాలో పరిస్థితి కొత్త టెక్నాలజీ.. సరికొత్త మోసాలు

డిజిటల్ చెల్లింపులు పెరిగిన మన దేశంలో, ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగాయి. అమాయకత్వమే పెట్టుబడిగా, భయమే ఆయుధంగా నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ప్రధాన సైబర్ నేరాలు ఇవే:

### కాల్ ఫార్వార్డింగ్ స్కామ్ (401) :

సైబర్ నేరగాళ్లు కస్టమర్ కేర్ లేదా కొరియర్ బాయ్స్ పేరిట కాల్ చేస్తారు. మీకు ఒక బహుమతి వచ్చిందని నమ్మించి 401 లేదా 62 తో మొదలయ్యే కోడ్‌ను ఫోన్‌లో డయల్ చేయమంటారు. ఆ కోడ్ డయల్ చేసిన వెంటనే మీ ఫోన్ కాల్స్, బ్యాంక్ లావాదేవీల మెసేజ్‌లు (ఓటీపీలు) నేరగాడి ఫోన్‌కు ఫార్వార్డ్ అవుతాయి. మీరు బిజీగా ఉన్నప్పుడు సైలెంట్‌గా మీ ఖాతా ఊడ్చేస్తారు.

### డిజిటల్ అరెస్ట్ - కస్టమ్స్ స్కామ్:

ఇది అత్యంత భయంకరమైన మోసం. పోలీస్, సీబీఐ, లేదా కస్టమ్స్ ఆఫీసర్ల పేరుతో ఫోన్ చేసి, "మీ పేరు మీద వచ్చిన పార్శిల్‌లో డ్రగ్స్ లేదా నకిలీ పాస్‌పోర్టులు పట్టుబడ్డాయి" అని బెదిరిస్తారు. స్కైప్ ద్వారా వీడియో కాల్ చేయించి, నకిలీ పోలీస్ స్టేషన్ సెటప్ చూపించి బాధితులను గదిలో నుంచి బయటకు వెళ్లనివ్వకుండా 'డిజిటల్ అరెస్ట్' చేస్తారు. కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు పంపాలని డిమాండ్ చేసి నిలువునా దోచేస్తారు.

### ఏఈపీఎస్ బయోమెట్రిక్ క్లోనింగ్ :

ముఖ్యంగా వ్యవసాయం చేసే రైతులను, పల్లెల్లో ఉండే సామాన్యులను లక్ష్యంగా చేసుకుంటున్న స్కామ్ ఇది. రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో భూముల రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చే వేలిముద్రలను సైబర్ క్రిమినల్స్ దొంగిలిస్తున్నారు. ఆ వేలిముద్రలను క్లోన్ చేసి (నకిలీవి సృష్టించి), 'ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్' ద్వారా బాధితులకు ఎలాంటి ఓటీపీ రాకుండానే బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు మాయం చేస్తున్నారు. పార్ట్‌టైమ్ జాబ్ / టాస్క్ స్కామ్స్: ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూసే యువతను టార్గెట్ చేసే స్కామ్. టెలిగ్రామ్ లేదా వాట్సాప్‌లో "ఇంటి దగ్గరే ఉండి రోజుకు 2000 సంపాదించండి" అంటూ వల వేస్తారు. మొదట యూట్యూబ్ వీడియోలకు లైక్ కొట్టడం లాంటి చిన్న టాస్క్‌లు ఇచ్చి, కొంత డబ్బు ఇస్తారు. ఆ తర్వాత 'ప్రీమియం టాస్క్' పేరుతో బాధితుల చేతనే లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టించి బోర్డు తిప్పేస్తారు.

డీప్‌ఫేక్ ముప్పు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పుణ్యమా అని ఇప్పుడు కంటికి కనిపించేది, చెవికి వినిపించేది నమ్మలేని పరిస్థితి. మన బంధువులు, స్నేహితుల ముఖాలను, గొంతును అచ్చుగుద్దినట్లు క్లోన్ చేసి వీడియో కాల్స్ చేస్తారు. అత్యవసరంగా ఆసుపత్రిలో ఉన్నామని, డబ్బులు కావాలని అడిగే ఈ తరహా మోసాలు కోట్లలో జరుగుతున్నాయి. స్నేహితుడి నంబర్ నుంచే కాల్ వస్తుంది. మాటల్లో పెట్టి మరొక నంబర్‌ను కాన్ఫరెన్స్ చేయమంటారు. అలా చేయగానే, వాట్సాప్ లాగిన్ ఓటీపీని వారు కాల్ ద్వారా వినేసి మీ వాట్సాప్‌ను హ్యాక్ చేస్తారు.

### యాప్ పర్మిషన్స్ మరియు క్యూఆర్ కోడ్స్:

సోషల్ మీడియా యాప్‌లు మన కదలికలు, మాటలు రికార్డ్ చేస్తుంటాయి. అలాగే పబ్లిక్ ప్లేసెస్‌లో ఉండే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసేటప్పుడు ఫోన్‌లోకి మాల్‌వేర్ ప్రవేశించేలా చేస్తున్నారు.

### నా సూచనలు - రక్షణ చర్యలు

టెక్నాలజీని వాడటం మానేయలేము, కానీ కనీస జాగ్రత్తలు పాటిస్తే సైబర్ ఉచ్చులో పడకుండా తప్పించుకోవచ్చు.

### వాట్సాప్ టూ-స్టెప్ వెరిఫికేషన్:

వెంటనే మీ వాట్సాప్ సెట్టింగ్స్‌లో టూ స్టెప్ వెరిఫికేషన్ ఆన్ చేసుకోండి. దీనికి 6 అంకెల పిన్ సెట్ చేసుకుంటే, మీ ఓటీపీ వేరేవాళ్లకు తెలిసినా వాట్సాప్ హ్యాక్ కాలేదు.

### ఆధార్ బయోమెట్రిక్ లాక్:

రైతులు, సామాన్యులు తమ ఖాతాల నుంచి డబ్బులు పోకుండా ఉండాలంటే 'ఎంఆధార్' యాప్ లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మీ బయోమెట్రిక్స్‌ను 'లాక్' చేసుకోండి. అవసరం ఉన్నప్పుడు మాత్రమే అన్‌లాక్ చేసుకోండి.

### యాప్ పర్మిషన్స్ & స్క్రీన్ షేరింగ్:

ప్లే స్టోర్ నుంచి కాకుండా బయట ఎక్కడినుంచీ యాప్‌లు ఇన్‌స్టాల్ చేయకండి. కస్టమర్ కేర్ అని చెప్పి ఎనీడెస్క్, టీమ్ వ్యూక్సర్ లాంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేయమంటే కచ్చితంగా ఫోన్ కట్ చేయండి. ఏ యాప్‌కైనా అనవసర పర్మిషన్స్ ఇవ్వకండి.

### వెరిఫై చేసుకోండి:

ఆన్‌లైన్‌లో వాట్సాప్ ద్వారా ఎవరైనా డబ్బులు అడిగితే, వాళ్లు ఎంత క్లోజ్ ఫ్రెండ్స్ అయినా సరే.. తిరిగి వాళ్లకు డైరెక్ట్ వాయిస్ కాల్ చేసి నిర్ధారించుకున్న తర్వాతే ముందడుగు వేయండి.

### మోసపోతే ఏం చేయాలి...? - న్యాయపరమైన రక్షణ

ఒకవేళ మీ ప్రమేయం లేకుండా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు కట్ అయితే భయాందోళన చెందవద్దు. తక్షణమే కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి కాల్ చేయండి. మీరు ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే, మీ డబ్బును సైబర్ పోలీసులు అంత త్వరగా 'ఫ్రీజ్' చేసి మీకు వెనక్కి ఇప్పించగలుగుతారు. అలాగే www.cybercrime.gov.in పోర్టల్‌లో కూడా ఆధారాలతో సహా ఫిర్యాదు చేయవచ్చు.
ఇలాంటి డిజిటల్ ఐడెంటిటీ థెఫ్ట్ (గుర్తింపు చోరీ), ఫేక్ వీడియోలు సృష్టించడం మరియు వ్యవస్థీకృత నేరాల కట్టడికి మన కొత్త భారతీయ న్యాయ సంహితలో అత్యంత కఠినమైన సెక్షన్లు, శిక్షలు అమలులో ఉన్నాయి. కాబట్టి మోసం జరిగిన వెంటనే ధైర్యంగా న్యాయస్థానాలను, పోలీసులను ఆశ్రయించండి. డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తే శ్రీరామ రక్ష. టెక్నాలజీని మన అభివృద్ధికి వాడుకుందాం, కానీ దానికి బానిసలమై, సైబర్ నేరగాళ్లకు బలైపోవద్దు!

వ్యాసకర్త
- ప్రాడ్వాక భీమరావు
ఆపరేషన్ మేనేజర్
@ Pageperfecttech
9948635844

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# మావోయిజం ఆయుధ రహిత పోరాటంలో విలీనం కానుందా?

మావోయిస్టు ఉద్యమం భావోద్వేగంతో కూడిన సైద్ధాంతిక మార్పు చెందినట్లు కనబడుతోంది. 1967లో పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ గ్రామంలో చారు మజుందార్, కానూ సన్యాల్,జంగల్ సంతాల్ నేతృత్వంలో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనుల, రైతుల హక్కుల కోసం ఓ సాయుధ పోరాటంగా ఆవిర్భవించిన నక్సల్బరీ ఉద్యమం మొదట చత్తీస్‌ఘడ్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెడ్ కారిడార్ గా మారి,ఆపై 20 వేల మంది పియల్జీఐ సైన్యంతో 16 రాష్ట్రాలలో తన కార్యకలాపాలను విస్తృత పరచింది. మావోయిజం ప్రధాన ఎజెండా: చైనా కమ్యూనిస్టు నాయకుడైన మావో జెడాంగ్ సిద్ధాంతాల ప్రేరణతో ప్రభుత్వ వ్యవస్థను కూలదోసి భూసంస్కరణలు అమలు చేయటమే లక్ష్యంగా,ఆ ప్రధాన ఎజెండా అమలు కోసం ఉద్యమ పంథానెంచుకుంది.సీపీఐ (మావోయిస్టు) పార్టీగా పిలువబడే ఈ అతిపెద్ద నక్సలైట్ సంస్థ నిషేధించబడిన జాబితాలో ఉండటం గమనార్హం. 1978లో జగిత్యాలలో జరిగిన పీపుల్స్ వార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జైత్రయాత్ర ద్వారా ఆ ప్రాంతం నుండి బలమైన పునాదితో పాటుగా,నాయకత్వ బీజాలు పడినాయి. అదే క్రమంలో ఆనాటి రైతు కూలీ సభ ద్వారా పార్టీ జవసత్వాలు కూడా మరింతగా బలపడినాయి. 2004 పీపుల్స్ వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (యంసిసిఐ) కలిసి సిపిఐ మావోయిస్టుగా ఆవిర్భవించింది. దశాబ్దాల కాలంగా వర్గ శతృత్వమే పునాదిగా,శత్రువులను ఎదుర్కొనే దిశలో,వ్యూహాత్మక అడుగులు వేస్తూ, పోలీసులకు, మావోయిష్టులకు జరిగిన ఎదురు కాల్పుల సంఘటన ల్లో ఇరుపక్షాలూ భారీ నష్టాన్నే చవిచూసినాయి.మావోయిస్టులు ఆధునిక ఆయుధాల తయారీలోనూ,పోలీస్ స్టేషన్లో ముట్టడి సందర్భంలో ఆయుధాల సమీకరణలోనూ దిట్టలుగా మారి,పోలీసుల ఎదురుకాల్పుల్లో సైతం ప్రభుత్వానికి సవాల్ విసిరిన సందర్భాలు మనకు తాజా వార్తల్లో మన కళ్ళ ముందు కదలాడే నిత్య సత్యాలే.ఆ సందర్భంగా జరిగిన ఆస్తి,ప్రాణ నష్టం లెక్కిస్తే గనుక అది సగటు జీవిని ఆశ్చర్యపరచక మానదు. కొద్ది కాలం పాటు రాజ్యంపై ఎదురుదాడి చేస్తూ,పీపుల్స్ వార్ అగ్రనేత కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో మావోయిస్టు సైన్యం మిలిటరీ శక్తిగా మారింది.ఆ సమయంలో పోరాటంలో తీవ్రమైన ప్రకంపనాలనే సృష్టించింది.నక్సల్బరీ సాయుధ పోరాటం నేర్పిన అనుభవపాఠమే తెలంగాణ ఉద్యమానికి సైతం కొత్త బలాన్నిచ్చింది.పోరాట పంథాకు చక్కటి దిశా నిర్దేశనం చేసింది.

### క్రమక్రమంగా బలహీనమవుతున్న



### నక్సల్బరీ భావోద్వేగం

2004 లో పీపుల్స్ వార్ ఎంసిపి విలీనంతో మావోయిస్టు పార్టీగా ఏర్పడినప్పటికి వివిధ కారణాలతో క్రమక్రమంగా క్షీణిస్తూ వచ్చింది. మావోయిస్టు పార్టీలో కీలక విభాగంలో దశాబ్దాల కాలంగా విప్లవ లక్షణాలను పుణికి పుచ్చుకున్న, ఆ భావజాల పోరాటంలో మమేకమై ఎన్నో కష్టనష్టాలు వచ్చినా,తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించి,సాయుధ పోరాటంలో భాగస్వాములైన కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి,మల్ల రాజిరెడ్డి,బడే చొక్కారావు తదితరుల లొంగుబాటు,కొద్ది రోజుల కిందటనే నంబాల కేశవరావుతో పాటుగా హిడ్మా,సత్యనారాయణ రెడ్డి, రామచంద్రారెడ్డి,గాజర్ల రవి, పాక హనుమంతు,అనల్దా తదితరులతో పాటు వందలాది మావోయిస్టులు అమరులవటం ,గతంలో లొంగిపోయిన మల్లోజుల,ఆశన్న లాంటి అగ్రనేతలు,పార్టీ సైనిక విభాగ ఇన్చార్జిలు,ఆయుధాలు విడిచి పెట్టడాన్ని, పరిగణలోకి తీసుకుంటే ,ఇదొక భావోద్వేగంతో కూడిన సైద్ధాంతిక మార్పుగా పరిగణించాల్సి ఉంటుంది.అందులోనూ రాజ్యాంగబద్ధంగా,రాజకీయ పంథా కొనసాగిస్తామని పేర్కొనడం గమనార్హం. మావోయిస్టుల భావజాలంలో వచ్చిన ఈ తాజా మార్పును మనం గమనంలోకి తీసుకోవాలి.

### భౌగోళిక కారణాలు

భద్రతా బలగాల నిరంతర కూంబింగ్,గిరిజన ప్రాంతాల్లో రోడ్లు,నెట్వర్క్ విస్తరించటం వల్ల, వారి రహస్య కదిలికలల్లో వచ్చిన పెనుమార్పులు, కొత్త తరం ఆశాజనకంగా మావోయిజంలో చేరకపోవడం,గతంలో లాగా యూనివర్సిటీ స్థాయిల్లో వుండే స్పందన క్రమేణా తగ్గడం,గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక బలగాల నిరంతర అణచివేత ధోరణి వల్ల మావోయిస్టు అగ్రనేతలు చట్ట పరిధిలోకిరావటం,మరికొందరు ఎదురు కాల్పుల్లో మృత్యువాతకు గురి కావటం,ఇంకొందరు అనారోగ్యం పాలవటం, మారుతున్న రాజకీయ,ఆర్థిక, సామాజిక వ్యవస్థలో సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని చేయించుకోవాలనే ఆనాటి ఆశయానికి,నేటి వర్తమానానికి సరితూగని పరిస్థితి నెలకొనడం ,అతి కొద్ది మంది మాత్రమే ఇది కాలం చెల్లిన సిద్ధాంతాలని భావనతో దూరమవటం తదితర కారణాల మూలాన వ్యవస్థ నిర్వీర్యానికి కొన్ని సహేతుక కారణాలుగా విశ్లేషించవచ్చు. ఏదేమైనప్పటికీ,వారు అజ్ఞాతంలో ఉండి ఏ సమాజోద్ధరణకోసం ఏ ప్రతిఫలాలందాలని ఆశించారో?అదే కోణంలో తమ పంథాను మార్చుకొని ఆయుధాలు లేని పోరాటంలో మిళితమై, రాజ్యాంగబద్ధంగా,రాజకీయ పార్టీగా రూపాంతరం చెందటమే వారి ముందున్న ఓ శాశ్వతపరిష్కారం.ఈ భావోద్వేగ ఉద్యమంలో అమరులైన నేతలకిచ్చే ఘనమైన నివాళిగా భావించాల్సి ఉంటుంది.

### ఆపరేషన్ కగార్ మావోయిస్టు రహిత భారత్ లక్ష్యం

1 జనవరి 2025 రోజున కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఆపరేషన్ కగార్" స్ఫూర్తితో సుమారు ఏడాదిన్నర క్రితం అబూజ్ మటడ్ అడవుల్లో ఆపరేషన్ కగార్ లో భాగంగా కేంద్ర బలగాలు వేసిన తొలి అడుగు నేపథ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో పొలిట్ బ్యూరో కేంద్ర కమిటీ సభ్యులు పదిమంది దాకా మృతి చెందడం మావోయిజానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. అలాగే, కాలగమనంలో బీఆర్ మృతి చెందడంతో పాటుగా, ప్రస్తుతం మావోయిస్టు చీఫ్ దేవ్ జీ లొంగుబాటు మావోయిజం శకం అంత్యదశకు చేరుకొన్నది. లొంగుబాటుకు గురైన మావోయిస్టు అగ్రనేతలు మాత్రం మావోయిజం సిద్ధాంతంపై తమ ఆశాభావాన్ని వ్యక్తపరుస్తూనేఉన్నారు. ఆరు దశాబ్దాల క్రితం ఏర్పడిన ఈ నక్సల్బరీ ఉద్యమం ప్రధాన ఎజెండా అయిన పేద,అట్టడుగు వర్గాల అభ్యున్నతికి,భూ వితరణ సంస్కరణ వాదం వివాదరహితంగా,న్యాయ పరిధిలో త్వరలో పరిష్కరించబడాలనీ, వారు ఆశించిన స్థాయిలో ప్రతిఫలాలందాలనీ,వారి ఆశలు,ఆశయాలు నెరవేరాలని ఆశిద్దాం!

- పరాంకుశం రఘు నారాయణ
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా
చరవాణి: 9949749987

# అగ్నిప్రమాదం పూరిల్లు దగ్ధం



**కారేపల్లి, మహా :** అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన కారేపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. కారేపల్లి ఇమ్మడిబజార్‌లోని రెడ్డిబోయిన వీరయ్య కుటుంబం చేనుపనులకు వెళ్ళిన సమయంలో పూరిల్లు అగ్నికి ఆహుతైంది. ఇంటి నుండి ఒకసారే మంటలు వ్యాపించటంతో చుట్టుపక్కల వారు స్పందించి గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను తెచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ లోపు ఇల్లందు నుండి ఫైరింజన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేసింది. ఈ ప్రమాదంలో గృహ పకరణాలు పూర్తి ధ్వంసమైనాయి. సంఘటన స్థలాన్ని సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ సందర్శించి బాధితులకు ప్రభుత్వం ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# ఘనంగా కారేపల్లిలో వన్యప్రాణి దినోత్సవం



**కారేపల్లి, మహా:** మానవ మనుగడకు చెట్లు, అడవుల రక్షణ ఎంతో అవసరమని వాటి సంరక్షణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని కారేపల్లి రేంజ్ అధికారి అన్నారు. మంగళవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా కారేపల్లి రేంజ్ కార్యాలయంలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధికారి మాట్లాడుతూ ఆరోగ్యం, వారసత్వం, జీవనోపాధిని సంరక్షించటం అనే నినాదంతో వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ సమతూల్యత కాపాడటంలో, మానవ జీవనానికి మద్దతు ఇవ్వటంలో వన్యప్రాణుల పాత్ర ఎంతో ఉందన్నారు. వన్య ప్రాణుల సంరక్షణలో ప్రజలు స్వచ్ఛంధంగా భాగస్వాములు కావాలని కోరారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించి, మెరుగైన భవిష్యత్తు కోసం ప్రక□తిని, వన్యప్రాణులకు రక్షించుకుందాం అని ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఎఫ‌ఆర్వో పీ.ఏప్రాప్రో డిటస్, డీఆర్వో అయేషా కుదూసియా, ఎఫఎస్వో లు డీ.చక్రవరి, పీ.కిషోర్‌కుమార్, ఎఫ్‌బీవో‌లు ఉష, వీరన్న ,పద్మ ,సైదా, గాంధీ, పుష్పలత, నాగరాజు, సిద్ధారావు బాపయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.,

# పినపాకలో ఘనంగా వన్యప్రాణుల దినోత్సవం

## 2కే రన్ నిర్వహణ




**పినపాక,మహా:**మండల పరిధి ఈ బయ్యారం అటవీశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం వన్యప్రాణుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2కే రన్ నిర్వహించారు.మండల కేంద్రం నుండి అటవీ శాఖ కార్యాలయం వరకు ఈ రన్ నిర్వహించగా, విజేతలకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. 2కే రన్ కార్యక్రమంలో 100 మందికి పైగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ తేజస్విని మాట్లాడుతూ "అడవులను రక్షించుకుందాం - వన్యప్రాణులను కాపాడుకుందాం" అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ "అడవుల పరిరక్షణ ద్వారా జీవనోపాధి - భూమిపై ప్రజల సుస్థిర జీవనానికి పునాది" అంటూ నినాదాలు చేశారు.అనంతరం కార్యాలయ ఆవరణలోని చెట్లకు పక్షులు నివసించేలా గూళ్లు ఏర్పాటు చేశారు. పర్యావరణ సమతుల్యతకు వన్యప్రాణులు కీలకమని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.భవిష్యత్తు తరాల కోసం వన్యప్రాణులు, ప్రకృతి వనరులను కాపాడుకోవడం మన అందరి కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓలు అరుణ, వెంకటేశ్వరరావు, ఇతర అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి హోలీ హోలీ ఆడిన విశ్వామిత్ర చౌహాన్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పర్యావరణ పరిరక్షణ కొరకు వాక్ ఫర్ ట్రీస్ కాన్సెప్ట్ తీసుకొని ప్రతిరోజు మొక్కలు నాటుతూ అందరూ మొక్కలు నాటాలని సందేశం ఇస్తున్న చిన్నారి విశ్వామిత్ర చౌహాన్ హోలీ పండుగ పురస్కరించుకొని మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా పనిచేసిన జితేష్ వి పాటిల్ నివాసంలో తన స్నేహితుడు కలెక్టర్ తనయుడు రాఘవతో తన సోదరుడు కశ్యపమిత్ర చౌహాన్ సోదరి రోహిత్ గాంధీ తో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొని రంగులు పూసుకున్నారు. అనంతరం కలెక్టర్ తల్లితో కలిసి తైవాన్ మామిడి మొక్కలు నాటి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# నారా భువనేశ్వరిని కలిసిన యాదిలాల్



**ఆమనగల్లు, మహా :**టిడిపి రాష్ట్ర నాయకుడు, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాదిలాల్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నీ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో కలిసి ఇటీవల అవార్డు అందుకున్న ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ పరంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వర్ కి వివరించినట్లు యాదిలాల్ పేర్కొన్నారు.

# గ్రహణం వేళ మైసిగండి మైసమ్మ గుడి తలుపులు బంద్!



**ఆమనగల్లు మహా :** కడ్తాల్ మండలంలోని ప్రసిద్ధ మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగామంగళవారం ఉదయం 7 గంటల నుండి బుధవారం ఉదయం 6 గంటల వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ ఈవోస్నేహలత ప్రకటించారు. గ్రహణం ముగిసిన అనంతరం ఆలయంలో ప్రత్యేక శుద్ధి కార్యక్రమాలుమరియు పూజలు నిర్వహించి, ఆ తర్వాతే భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తామనిఆమె స్పష్టం చేశారు.









# రంగుల పండుగ హోలీ జోరు.. ఆమనగల్లులో కేరింతల హోరు!

## రంగుల వానలో యువత చిందులు

**ఆమనగల్లు, మహా :** కల్వకుర్తి నియోజకవర్గంలో హోలీ వేడుకలు జోరుగా సాగాయి.చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూకలిసి రంగులు పూసుకుంటూ.. డ్యాన్సులు వేస్తూ హోలీ పండుగ చేసుకున్నారు. రంగుల పండుగ కేరింతలు,ఆనందోత్సవాల మధ్య మంగళవారం ప్రజలు హోలీ పండుగను జరుపుకొన్నారు. పల్లె, పట్టణం ఏ వీధిలో చూసినా హోలీ వేడుకలు కనువిందు చేశాయి. చిన్నారులు, యువతీయువకులు, పెద్దలు రంగుల్లో మునిగి తేలారు. పలుచోట్ల హోలీ సందర్భంగా కామదహనం నిర్వహించారు. చిన్నాపెద్దా కలిసి ఆడిపాడుతూ.. రంగులు పూసుకుంటూసందడి చేశారు.హోలీ సందర్భంగా పోలీసులు ఆంక్షలు విధించారు. బహిరంగ ప్రదేశాల్లో హోలీ వేడుకలునిషేధించారు.అపరిచితులపై రంగులు వేయరాదన్నారు. భవనాలు, వాహనాలపై రంగులు పోయవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవనిపోలీసులు హెచ్చరించారు.

# ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు..?

- గత నెలలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలు
- ఇబ్రహీంపట్నంలో నిలిచిన చైర్మన్ ఎన్నిక
- మూడు వారాల్లో ఎన్నిక పూర్తి చేయాలి: హైకోర్టు ఆదేశాలు..?






**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**మూడు వారాల్లోగా ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి, తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తెలిపింది.

**గత నెలలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలు....**

రాష్ట్రవ్యాప్తంగా గత ఫిబ్రవరి నెలలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో, రంగారెడ్డి జిల్లాలో ఆరు మున్సిపాలిటీలో ఎన్నికలు జరగగా, ఐదు మున్సిపాలిటీలలో ఫలితాలు వచ్చి, చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక జరిగి, పూర్తిస్థాయి పాలకవర్గం ఏర్పాటు అయ్యి పరిపాలన కొనసాగుతుంది.

**ఇబ్రహీంపట్నంలో వీటన్నిటికి విరుద్ధంగా...**

జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లకు, ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం అనంతరం రిటర్నింగ్ అధికారి, నియామక పత్రాన్ని అందజేశారు. ఇదే క్రమంలో అదే రోజు జరగాల్సిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పలు కారణాల వల్ల రిటర్నింగ్ అధికారి మరుసటి రోజుకు వాయిదా వేశారు. ఫిబ్రవరి 17న జరగాల్సిన చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో, చైర్మన్ ఎన్నికను నిలిపివేయాలని, ఎన్నికపై స్టే విధించారంటూ, హైకోర్టు నుంచి వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా, చైర్మన్ ఎన్నిక ప్రక్రియను, రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ అనంతరెడ్డి మధ్యలోనే నిలిపివేశారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోర్టుకు వెళ్లడంతో మున్సిపాలిటీ పూర్తిస్థాయి పాలకవర్గ నియామకం నిలిచిపోయింది. మంగళవారం తెలంగాణ హైకోర్టు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను మూడు వారాలలో పూర్తి చేయాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్కు కోర్టు ఆదేశాలు జారీ చేశారంటూ సమాచారం.?

**ఇబ్రహీంపట్నం 'పీఠం'పై హైకోర్టు తుది తీర్పు..?**

మూడు వారాల లోపు ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ను హైకోర్టు ఆదేశించింది. కౌన్సిలర్లు ఎవరి ఒత్తిడికి లోనవ్వకుండా స్వచ్ఛందంగా తమ మద్దతును తెలుపేలా చర్యలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. చైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారిది అని హైకోర్టు తేల్చి చెప్పింది.?

# కాంగ్రెస్‌లో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల చేరిక



- కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం
- ఇంచార్జి మంత్రి జూపల్లి సమక్షంలో చేరిన వివిధ గ్రామాల సర్పంచ్ లు
- కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నచ్చి చేరినట్టు సర్పంచ్ ల వెల్లడి
- ప్రభుత్వ సహకారంతో గ్రామాల అభివృద్ధి కోసం పని చేస్తామని స్పష్టం
- మంత్రి సమక్షంలో చేర్పించిన కంది శ్రీనివాస రెడ్డికి కృతజ్ఞతలు

ఆదిలాబాద్ మహా : తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలన చూసి గ్రామాలు కాంగ్రెస్ బాట పడుతున్నాయని ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరేందుకు హైదరాబాద్ తరలివచ్చిన జిల్లాలోని వివిధ గ్రామాల సర్పంచ్ ఉప సర్పంచ్ లకు ఆయన కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలో నిత్యం చేరికలు జరుగుతుండటం అభినందనీయమన్నారు.గ్రామ పాలనలో ముఖ్యమైన సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై చేరడం హర్షనీయమన్నారు. గ్రామాల అభివృద్ధికి వారంతా పాటు పడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీలో చేరిన జైనథ్ మండలం నిరాల గ్రామ సర్పంచ్ చౌదరి ప్రభాకర్, ఉప సర్పంచ్ ఫిరోజ్ ,మావల మండలంబట్టిసావర్గం గ్రామ సర్పంచ్ మెట్పెల్లి శ్రీనివాస్ రెడ్డి, భోరజ్ మండలం తరోడా (బి) గ్రామ సర్పంచ్ బోయర్ అరవింద్, ఆదిలాబాద్ రూరల్ మండలం దిమ్మ గ్రామ సర్పంచ్ కొండ లక్ష్మణ్ లకు మంత్రి జూపల్లి ,ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి పార్టీలో చేరినట్లు సర్పంచ్ లు ,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుంటామన్నారు. ఇంచార్జి మంత్రి సమక్షంలో చేరడం ఆనందంగా ఉందని ఇందుకు సహకరించిన కంది శ్రీనివాస రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్‌రావ్, గణపతి రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్, ఏవన్ ,ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు,

# ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా హోలీ సంబరాలు



**ఆదిలాబాద్ మహా:** హోలీ పండుగ సందర్భంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సంబరాలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా పోలీసుల సమక్షంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, పిఓ ఐటిడిఏ యువరాజ్ మర్మాట్, అడిషనల్ ఎస్పీ మౌనిక , ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్ పోలీస్ అధికారులు రంగులు చల్లుతూ హోలీ పండుగను జరుపుకున్నారు. ఎస్పీ అధికారులతో కలిసి ఆనంతంగా నృత్యాలు చేసారు. ఒకరికొకరు మిఠాయిలు తెనిపించుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలకు ఎస్పీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు. యువత వాహనాలను అతి వేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని, చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో,సురక్షితంగా హోలీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.





## మున్సిపల్ చైర్ పర్సన్

# హోలీ సంబరాలు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణ ప్రజలు కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీశ్ హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. రసాయన రంగులకు దూరంగా ఉండి, సహజసిద్ధమైన రంగులతో పండుగ జరుపుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలకు ఆమె హోలీ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ రంగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ శానిటేషన్ కార్మికులతో కూడా హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు , 45వ వార్డ్ కాలనీ వాసులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ఊయలే... చిన్నారి మెడకు ఉరితాడైంది

- ఆడుకుంటున్న ఊయలలో... చీర మెడకు చుట్టుకుని బాలిక మృతి
- ఎల్లారెడ్డిగూడలో విషాదం



**కుషాయిగూడ, మహా :** ఆడుకుంటున్న ఊయలే... చిన్నారి మెడకు ఉరితాడై చీర చుట్టుకుని మరణించిన విషాద ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఎల్లారెడ్డిగూడలో చోటుచేసుకుంది. సీఐ సైదయ్య తెలిపిన కథనం ప్రకారం... కాప్రా మండల పరిధి ఎల్లారెడ్డిగూడలో నవనీత, భర్త, ఇద్దరు కూతుర్లు పవిత్ర(8), ఆరాధ్య(7నెలలు)తో కలిసి నివసిస్తున్నారు. గత కొంత కాలంగా భర్తతో విభేదాల కారణంగా నవనీత వేరుగా ఉంటూ... స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 2న సాయంత్రం చిన్న కూతురు కోసం కట్టిన ఊయలలో పెద్ద కూతురు పవిత్ర ఆడుకుంటుండగా... నవనీత కూలీ చేసిన డబ్బులు తీసుకురావడానికి దగ్గరలోని ఓ ఇంటికి వెళ్ళింది. వెంటనే తిరిగి వచ్చేలోపు పవిత్ర(8) ఊయలలో విగత జీవిగా కనిపించింది. వెంటనే కిందికి దించి దగ్గరలోని ఓ ప్రైవేటు దవాఖానాకు తరలించగా అప్పటికే బాలిక మృతి చెందిందని వైద్యులు తెలిపారు. చిన్నారి పవిత్ర ఊయలలో ఆడుకుంటుండగా చీర మెడకు చుట్టుకుని చనిపోయి ఉండొచ్చని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తల్లి నవనీత పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పిల్లలను చంపి తల్లి సూసైడ్

**ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించే విధంగా మృతురాలు సూసైడ్ నోట్**



**యాదాద్రి భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గొల్లగూడెం లో దారుణం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకల ఐశ్వర్య 28 అనే వివాహిత తెల్లవారుజామున తన ఇద్దరు పిల్లలు కుమార్తె ఝాన్సీ 2, కుమారుడు 9 నెలల(పండు) పసికందును చంపి తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు రాసిన మూడు పేజీల సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఐశ్వర్య కు భర్త మహేష్ కు ఐదు సంవత్సరాల క్రితం వివాహం కాగా.. కొద్ది నెలలకే భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఏడాదిన్నర కాలంగా భార్య వలిగొండ మండలం వేములకొండ అమ్మగారింట్లో నివసిస్తుంది. భర్తకు వేరే వివాహేతర సంబంధాల ఉన్నాయని మృతురాలు సూసైడ్ నోట్లో రాసినట్లు భువనగిరి డీఎస్పీ బి.రవీందర్ వెల్లడించారు. అయితే అమ్మగారింటి దగ్గర నివసిస్తున్న ఐశ్వర్యను అత్తగారింటి వాళ్లు పిలవగా నిన్న ఐశ్వర్య తల్లిదండ్రులు అత్తగారింట్లో వదిలి వెళ్ళిన కొన్ని గంటలకే ఈ దారుణం చోటుచేసుకుంది. అయితే మృతురాలు రాసిన సూసైడ్ నోట్ ప్రతి ఒక్కరినీ కలిచివేస్తుంది. ఘటన సమయంలో భర్త రైల్వే ఉద్యోగి కాగా విధుల్లో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మృతురాలి బంధువులు కొంత ఆందోళన చేస్తుండడంతో ఎలాంటి ఘటనలు చోటు చేసు కోకుండాపోలీసులు భారీగా మోహరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

# వలిగొండలో హోలీ సంబరాలు



**వలిగొండ, మహా :**వలిగొండ మండల కేంద్రం లో వివిధ గ్రామాలలో మంగళవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు చిన్న పెద్ద తేడా లేకుండా వివిధ రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా డాన్సులు వేస్తూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఘనంగా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు

## హోలీ సంబరాలు జరుపుకున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి, మహా :** భువనగిరి జిల్లా కేంద్రంలో శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం కార్యకర్తలతో ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ సంతోషంగా హోలీ సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు సంబరాలలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## డిఎస్పీ నీ కలిసిన సంస్కృత పూర్వ విద్యార్థులు




**వేములవాడ,మహా:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణానికి నూతన డిఎస్పీగా పదవి బాధ్యతలు చేపట్టినటువంటి ఏ శ్రీనివాస్ ను మంగళవారం సంస్కృత విద్యార్థి బృందం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న సన్నిధిలో సేవ చేసే భాగ్యం లభించినందుకు ఆనందాన్ని వ్యక్తపరిచారు .ఈ కార్యక్రమంలో సంస్కృత విద్యార్థి సంఘం అధ్యక్షులు అల్లాడి చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరగోని చైతన్య గౌడ్ పాల్గొన్నారు.

# కొమ్మల జాతరలో ముస్తాబైన ప్రభ బండి

**ప్రారంభించిన డిసిసి అధ్యక్షులు కుడా చైర్మన్ ఇనగాల**



**మహా వరంగల్ బ్యూరో;**వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలం కొమ్మాల గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలం అక్కెంపేట గ్రామ సర్పంచ్ ముద్దం సాంబయ్య ఆధ్వర్యంలో ముస్తాబు చేసిన ప్రభ బండిని హన్మకొండ డిసిసి అధ్యక్షులు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మన ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే కొమ్మాల జాతరలో ప్రభ బండ్ల ఊరేగింపు అత్యంత విశిష్టమైనదని స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని, ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. గ్రామ ప్రజలు ఇంతటి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, చైర్మన్, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని, ప్రభ బండికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# హార్మూజ్ హీట్.. ఎగుమతులకు షాక్

- పన్ను రీయింబర్స్‌మెంట్ రేట్లు తగ్గించొద్దు
- నిలిచిపోయిన సరుకుపై అదనపు చార్జీలు వద్దు
- కస్టమ్స్ అనుమతులను వేగవంతం చేయాలి
- ఎగుమతిదారుల డిమాండ్.. అండగా ఉంటామన్న కేంద్రం
- ఎగమతిదారులు, లాజిస్టిక్స్ సంస్థలతో చర్చలు



క్రూడ్ కల్లోలం.. గ్లోబల్ మార్కెట్లు కుదేల్

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ పరిస్థితులతో భారత వాణిజ్యంపై అనిశ్చితులు నెలకొన్నాయి. దేశ వాణిజ్యం (ఎగుమతులు-దిగుమతులు)పై ఏ మేర కు ప్రభావం పడుతుందో తెలుసుకునేందుకు ఎగుమతిదారులు, లాజిస్టిక్స్ భాగస్వాములతో కేంద్ర వాణిజ్య శాఖ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎగుమతిదారులు ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్లు పెట్టారు. రెమిషన్ ఆఫ్ డ్యూటీస్ అండ్ ట్యాక్సెస్ (రాడ్‌టెప్) పథకం కింద.. ఎగుమతిదారుల రవాణా వ్యయాలపై ఇప్పటి వరకు అధిక శాతం రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉండేది.దీన్ని ఇటీవలే సగానికి తగ్గించడం గమనార్హం. అలా చేయకుండా ఇంతకుముందు మాదిరే అధిక రేట్లను అమలు చేయాలని ఎగుమతిదారులు డిమాండ్ చేశారు. యుద్ధం పేరుతో సరుకు రవాణాపై ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెంచకుండా ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను (ఈసీజీసీ) ను ఆదేశించాలని, మరిన్ని ఉత్పత్తులను బీమా కవరేజీలో చేర్చాలని కోరారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈలపై ప్రభావం తగ్గించే చర్యలు అవసరమని సూచించారు. సరుకు రవాణాపై స్పష్టత ఉండాలని, అనవసర జాప్యాన్ని నివారించాలని, డాక్యుమెంటేషన్ ప్రక్రియ సాఫీగా, సజావుగా ఉండాలని ఎగుమతిదారులు కోరారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా సంయుక్త సైనిక చర్యలు చేపట్టడం, ప్రతిగా ఇరాన్ పశ్చిమాసియా వ్యాప్తంగా ఉన్న అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తుండడం తెలిసిందే. అంతేకాదు హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. ప్రపంచ చమురు రవాణాలో 15 శాతం, గ్యాస్ సరఫరాలో 20 శాతం రవాణాకు ఈ మార్గమే ఆధారం. ముడి చమురు ఇప్పటికే బ్యారెల్ 85 డాలర్లకు పెరిగిపోవడం గమనార్హం.

**పోటీతత్వానికి గండి**

హార్మూజ్ జలసంధిని మూసివేయడం వల్ల చమురు వాణిజ్యంపై ప్రభావం పడి ధరల పెరుగుదలకు దారితీస్తుందని ఎగుమతిదారు లు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తమకు వ్యయాలు పెరిగిపోతాయని.. దీంతో భారత వస్తువుల పోటీతత్వం తగ్గిపోతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విమాన రాకపోకల అంతరాయం వల్ల ఎయిర్‌పోర్టుల్లో నిలిచిపోయిన సరుకుపై అదనపు చార్జీలు రద్దు చేయాలని అప్పారెల్ ఎక్స్‌పోర్టర్స్ కౌన్సిల్ ఏఈపీసీ కోరింది.

**ఎగుమతులపై ప్రభావం..**

దేశ ఎగుమతుల్లో సుమారు 15 శాతం విమానాల ద్వారానే జరుగుతుంటాయి. పశ్చిమాసియా వ్యాప్తంగా పలు దేశాలు గగనతలాలను మూసివేయడం వల్ల పండ్లు, కూరగాయలు, ఆభరణాల రవాణా భారంగా మారనుంది.

**ఎంఎస్ఎంఈలకు భరోసా..**

పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వాణిజ్య శాఖ పేర్కొంది. భారత ఎగుమతులు, దిగుమతులు స్థిరంగా కొనసాగించేందుకు (సరఫరా వ్యవస్థ).. ఎగమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కస్టమ్స్ అనుమతులు, చెల్లింపులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. దేశ ఉత్పత్తికి అవసరమైన కీలక దిగుమతులపై ఎలాంటి తీవ్ర ప్రభావం లేదని స్పష్టం చేసింది. త్వరగా పాడయ్యే వస్తువులు, ఫార్మాస్యూటికల్స్, అధిక విలువ కలిగిన తయారీ ఉత్పత్తుల ఎగుమతులు సాఫీగా సాగేందుకు ఉన్న మార్గాలపైనా చర్చించినట్టు తెలిపింది.

**క్రూడ్ కల్లోలం.. గ్లోబల్ మార్కెట్లు కుదేల్**

అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతుండటం అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేస్తోంది. ప్రధానంగా చమురు, సహజ వాయువు, పెట్రోలియం ఆధారిత ఇంధనాలను గణనీయంగా ఉపయోగించే దేశాల స్టాక్ మార్కెట్లు, కంపెనీలను కుదేలు చేస్తోంది. ఒక దశలో అమెరికాలో కీలకమైన సూచీలైన డోజోన్స్ 2.5 శాతం (1,232 పాయింట్లు), నాస్‌డాక్ 2.7 శాతం మేర క్షీణించాయి. ఎస్అండ్‌పీ 500లోని 95 శాతం స్టాక్స్ నష్టపోవడం గమనార్హం. పెరిగే ఇంధన భారం, ఫ్లయిట్ల రద్దుపరమైన సవాళ్లతో అమెరికాలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ షేరు 5.4 శాతం, అమెరికన్ ఎయిర్‌లైన్స్ 5.8 శాతం పతనమయ్యాయి.అటు ఆసియా, యూరప్ సూచీలు కూడా తగ్గాయి. దక్షిణ కొరియా కోస్పి స్టాక్ ఇండెక్స్ ఏకంగా 7.2 శాతం పతనమైంది. ఆరు నెలలకు పైగా సరిపడే ఆయిల్ నిల్వలున్నప్పటికీ జపాన్ నికాయ్ 225 సుమారు 3 శాతం క్షీణించగా, జర్మనీకి చెందిన డాక్స్ సూచీ 3.9 శాతం పతనమైంది. మంగళవారం హోలీ సందర్భంగా సెలవు కావడంతో దేశీ మార్కెట్లు పనిచేయలేదు. గ్లోబల్ మార్కెట్ల ప్రభావంతో బుధవారం (నేడు) గ్యాప్ డౌన్‌తో ప్రారంభం కావొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. ఆయిల్ అప్..గోల్డ్ డౌన్..: అంతర్జాతీయంగా ప్రామాణికమైన బ్రెంట్ క్రూడాయిల్ రేటు బ్యారెల్‌కి 7% పైగా పెరిగి 83.33 డాలర్ల వద్ద, నైమెక్స్ 7.5 శాతం పెరిగి 76.60 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. మరోవైపు, ఔన్సు (31.1 గ్రాముల) పసిడి 3 శాతం పైగా నష్టపోయి 5,133 డాలర్ల వద్ద, సిల్వర్ 6 శాతం పైగా క్షీణించి 83.42 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

# ఎస్కార్ట్స్ కు బోటా ప్రత్యేక ట్రాక్టర్లు

**ధర రూ. 5.75 లక్షల నుంచి ప్రారంభం**



**బిజినెస్ బ్యూరో:** దక్షిణాది రాష్ట్రాల్లో వరి సాగుకు సంబంధించి శౌర్య పేరిట ప్రత్యేక ట్రాక్టర్ల సిరీస్‌ని ఎస్కార్ట్స్ కుబోటా (ఈకేఎల్) ఆవిష్కరించింది. ఇందులో 39 హెచ్‌పీ నుంచి 52 హెచ్‌పీ వరకు అయిదు వేరియంట్స్ ఉంటాయి. ధర రూ. 5.75 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ప్రస్తుతం కుబోటా, ఫార్మ్‌ట్రాక్, పవర్‌ట్రాక్ బ్రాండ్స్ కింద వివిధ వర్గాల రైతుల కోసం ట్రాక్టర్లు విక్రయిస్తున్నామని, వచ్చే ఐదేళ్ల వ్యవధిలో 8-10 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నామని ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సంస్థ సీఎండీ నిఖిల్ నందా తెలిపారు. ప్రస్తుతం ఆరు ప్లాంట్లు ఉండగా గ్రేటర్ నోయిడాలో 154 ఎకరాల స్థలంలో కొత్త ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తొలి దశలో విడతలవారీగా రూ. 2,300 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో విక్రయాలు 16 శాతం వృద్ధి చెందాయని, సంవత్సరం ముగిసే నాటికి 1,30,000 యూనిట్ల వరకు విక్రయాలు సాధించే అవకాశం ఉందని నందా వివరించారు.

# చమురు సమస్యకు చాన్స్ లేదు

**భారత్ వద్ద తగినన్ని నిల్వలు**
**6–8 వారాలకు సరిపడేంతగా ఉన్నాయి**
**ఇరాన్ పరిణామాలపై కేంద్రం వివరణ**




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో స్వల్పకాలికంగా ఇంధనాల సరఫరాలో ఆటంకాలేర్పడినా భారత్‌కి ఇబ్బందేమీ ఉండదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మన దగ్గర 6-8 వారాల డిమాండ్‌కి సరిపడేంతగా పెట్రోల్, డీజిల్, ఇతర ఇంధనాల నిల్వలు ఉన్నాయని వివరించాయి. ప్రభుత్వం రోజువారీగా, ప్రతి గంటకు పరిస్థితిని సమీక్షిస్తోందని చమురు శాఖ అధికారి ఒకరు తెలిపారు. వారం పది రోజుల్లో ఈ సంక్షోభం ముగిసిపోయే అవకాశం ఉందనే అంచనాలు నెలకొన్నట్లు వివరించారు. దేశీయంగా 25 రోజులకు సరిపడే స్థాయిలో క్రూడాయిల్, ఇంధనాల నిల్వలు ఉన్నాయని, ఒకవేళ సంక్షోభం మరింత కాలం కొనసాగినా దాదాపు అంతే కాలానికి సరిపడేంతగా ఆయిల్ సరఫరా అమెరికా, రష్యా మొదలైన దేశాల నుంచి వస్తోందని పేర్కొన్నారు. దేశీయంగా వైజాగ్, మంగళూరు, పాదూర్ నిల్వ కేంద్రాల్లో 100 మిలియన్ బ్యారెళ్ల పెట్రోలియం రిజర్వ్‌లు ఉన్నాయి.

**ధరలు పెరిగితే దిగుమతుల బిల్లులు భారం ..**

తక్షణమైతే ఇంధనాలకు కొరత ఏర్పడకపోవచ్చు కానీ క్రూడాయిల్ ధరలు, రవాణా.. బీమా వ్యయాలు పెరగడమనేది భారత దిగుమతుల బిల్లు, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారి చెప్పారు. అంతర్జాతీయంగా ప్రామాణికమైన బ్రెంట్ క్రూడాయిల్ ధర ఇరాన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి సుమారు 10 శాతం పెరిగి బ్యారెల్‌కి 80 డాలర్ల స్థాయిని దాటింది. 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ క్రూడాయిల్ దిగుమతుల కోసం 137 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి పది నెలల్లో 206.3 మిలియన్ టన్నుల క్రూడాయిల్ దిగుమతుల కోసం 100.4 బిలియన్ డాలర్లు వెచ్చించింది. మరోవైపు, పశ్చిమాసియాలో అనిశ్చితుల వల్ల స్వల్పకాలికంగా తలెత్తే సవాళ్లను పరిష్కరించుకునేలా దేశీయంగా పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) సహా కీలక పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు పుష్కలంగా ఉన్నట్లు కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి చెప్పారు. దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా, నిల్వలను నిరంతరం సమీక్షించేందుకు ఆయిల్ శాఖ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది వారంలో ఏడు రోజులూ, ఇరవై నాలుగు గంటలు పని చేస్తుందని చెప్పారు. అత్యధికంగా చమురును దిగుమతి చేసుకునే దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో, రిఫైనింగ్‌లో నాలుగో స్థానంలో, పెట్రోలియం ప్రొడక్టుల ఎగుమతుల్లో అయిదో స్థానంలో ఉంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# మాజీ కేంద్ర మంత్రి ఉన్నికృష్ణన్ కన్నుమూత


కోజికోడ్: భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ నేత కేపీ ఉన్నికృష్ణన్ (89) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన 1980, 90వ దశకాల్లో జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. గత కొంతకాలంగా ఆయన వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కేరళలోని కోజికోడ్‌లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వడకర నియోజకవర్గం నుంచి వరుసగా ఆరుసార్లు లోక్‌సభకు ఎన్నికై రికార్డు సృష్టించిన ఉన్నికృష్ణన్.. విలువలతో కూడిన రాజకీయాలకు నిలువుటద్దంగా నిలిచారని చెబుతుంటారు. జర్నలిస్టుగా జీవితాన్ని ప్రారంభించిన ఉన్నికృష్ణన్ రాజకీయాల్లోకి ప్రవేశించి, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. 1971లో తొలిసారిగా కాంగ్రెస్ అభ్యర్థిగా వడకర నుంచి పార్లమెంటులో అడుగుపెట్టిన ఆయన, ఆ తర్వాత 1977, 1980, 1984, 1989, 1991 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. వీపీ సింగ్ కేబినెట్‌లో ఉపరితల రవాణా, కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా పనిచేశారు.నాడు గల్ఫ్ యుద్ధ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించే ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించి, అందరి ప్రశంసలు అందుకున్నారు. ఉన్నికృష్ణన్ ఆదర్శాలకు కట్టుబడి నడుచుకున్నారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. వి.కె. కృష్ణమీనన్‌కు అత్యంత సన్నిహితుడిగా, ఒకానొక సమయంలో ఇందిరా గాంధీకి నమ్మకస్తుడైన అనుచరుడిగా ఉన్నప్పటికీ, సిద్ధాంతపరమైన విభేదాల కారణంగా కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారు. అనంతరం కాంగ్రెస్ (యూ), కాంగ్రెస్ (ఎస్) పార్టీల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. 198184 మధ్య కాలంలో పార్లమెంటులో కాంగ్రెస్ (సెక్యులర్) పక్ష నేతగా, 198082లో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. సుదీర్ఘ విరామం తర్వాత 1995లో తిరిగి సొంతగూడు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

1936 సెప్టెంబర్ 20న జన్మించిన ఉన్నికృష్ణన్ విద్యాభ్యాసం మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో సాగింది. చెన్నైలోనే న్యాయశాస్త్ర పట్టా పొందిన ఆయన విద్యార్థి దశలోనే సోషలిస్ట్ పార్టీ, ప్రజా సోషలిస్ట్ పార్టీల ద్వారా రాజకీయ ఓనమాలు దిద్దారు. 1960వ దశకంలో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి, 1962 నాటికే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (AICC) సభ్యుడిగా ఎదిగారు. ఒక జర్నలిస్టుగా, న్యాయవాదిగా, పార్లమెంటేరియన్‌గా పేరుగాంచిన ఆయన మృతికి పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# రాజ్యసభ బరిలో నితీష్ తనయుడు నిశాంత్?




పట్నా: బిహార్ రాజకీయ ముఖచిత్రంలో మరో కీలక మలుపు చోటుచేసుకోనుంది. ముఖ్యమంత్రి, జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీష్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఖాయమయ్యింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం జేడీయూ తరఫున ఆయనను రాజ్యసభకు పంపేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించింది. నిశాంత్ రాజకీయ రంగ ప్రవేశాన్ని జేడీయూ సీనియర్ నేత శ్రవణ్ కుమార్ స్పష్టం చేశారు. నిశాంత్ కుమార్ క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నారని, రాబోయే ఒకటి రెండు రోజుల్లో దీనిపై పార్టీ అధికారిక ప్రకటన వెలువడుతుందని ఆయన పేర్కొన్నారు. హోలీ పండుగకు ముందే ఈ నిర్ణయం వెలువడటంతో పార్టీ శ్రేణులు, మద్దతుదారుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. గత కొన్నేళ్లుగా నిశాంత్ కుమార్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని పార్టీ కార్యకర్తలు నిరంతరం కోరుతున్న తరుణంలో, ఈ ప్రతిపాదనకు కార్యరూపం లభించింది. ఇనిశాంత్ కుమార్‌కు పార్టీలో అత్యంత కీలకమైన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని, అది రాజ్యసభ సభ్యత్వం కూడా కావచ్చని మంత్రి శ్రవణ్ కుమార్ పరోక్షంగా తెలియజేశారు. 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించినప్పటి నుండి నిశాంత్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు జోరందుకున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా సమక్షంలోనే నిశాంత్ ప్రవేశంపై చర్చ జరగగా, సరైన సమయం కోసం నిరీక్షించినట్లు తెలుస్తోంది. జేడీయూ మనుగడకు, పార్టీ పటిష్టతకు నితీష్ వారసుడు రావడం అనివార్యమని అటు విపక్ష నేతలు సైతం గతంలో వ్యాఖ్యానించిన నేపథ్యంలో, ఈ పరిణామం బిహార్ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీస్తోంది.



# పహల్గాం దర్యాప్తు.. 'గోప్రో'లో కీలక రహస్యాలు?

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం పర్యాటక ప్రాంతంలో చోటుచేసుకున్న ఘోర ఉగ్రదాడి కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడులకు సంబంధించిన కీలక ఆధారంగా భావిస్తున్న ఒక 'గోప్రో' (GoPro) కెమెరా మూలాలను వెతుక్కుంటూ భారత జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) ఇప్పుడు చైనా గడప తొక్కేందుకు సిద్ధమయ్యింది. నాడు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 25 మంది పర్యాటకులతో పాటు స్థానికుడొకరు ప్రాణాలు కోల్పోయిన తెలిసిందే. ఈ దాడికి ముందు ఉగ్రవాదులు నిర్వహించిన రేక్కీ, వారి కదలికలకు సంబంధించిన దృశ్యాలు 'గోప్రో హీరో 12 బ్లాక్' కెమెరాలో నిక్షిప్తమైనట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఈ క్రమంలో ఆ పరికరానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు చైనా ప్రభుత్వానికి 'లెటర్ రోగేటరీ' పంపేందుకు జమ్ము కోర్టు 'ఎన్ఐఏ'కు అనుమతినిచ్చింది. దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ తొలుత నెదర్లాండ్స్‌లోని గోప్రో తయారీ సంస్థను సంప్రదించగా, విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. ఆ నిర్దిష్ట సీరియల్ నంబర్ గల కెమెరాను చైనాకు చెందిన 'ఏఈ గ్రూప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్' అనే డిస్ట్రిబ్యూటర్ సంస్థకు సరఫరా చేసినట్లు తయారీదారు తెలిపారు. అంతేకాకుండా ఈ పరికరం 2024, జనవరి 30న చైనాలోని డాంగ్‌గువాన్ ప్రాంతంలో యాక్టివేట్ అయినట్లు సాంకేతిక ఆధారాల ద్వారా తెలిసింది. అయితే ఆ తర్వాత ఆ కెమెరా ఎవరి చేతులు మారింది? అంతిమంగా ఉగ్రవాదుల వద్దకు ఎలా చేరింది? అనే వివరాలు తమ వద్ద లేవని సదరు సంస్థ పేర్కొంది. దీంతో ఆ కెమెరాను కొనుగోలు చేసిన వ్యక్తి, దాని వినియోగదారుడు, దానికి సంబంధించిన సాంకేతిక రికార్డులను సేకరించేందుకు చైనా అధికారుల న్యాయ సహాయం తప్పనిసరని ఎన్ఐఏ భావిస్తోంది. భారత్‌పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన ఈ పహల్గాం దాడి అనంతరం భారత్ అత్యంత కఠినంగా స్పందించింది. గత ఏడాది మే 7వ తేదీ తెల్లవారుజామున 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించి, శత్రువుల నెట్‌వర్క్‌ను దెబ్బతీసింది. ఈ దాడులకు ప్రధాన కారకులైన సులైమాన్ షా, హమ్జా అఫ్గానీ అలియాస్ అఫ్గాన్, జిబ్రాన్ అనే ముగ్గురు ఉగ్రవాదులను దాచిగామ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో భద్రతా దళాలు మట్టుబెట్టాయి.

# మోదీ యూట్యూబ్ చానల్‌కు 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు




**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ యూట్యూబ్ చానల్ 3 కోట్ల సబ్‌స్క్రైబర్ల మార్కును దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా ఇంత పెద్ద సంఖ్యలో సబ్‌స్క్రైబర్లు ఉన్న ఏకైక రాజకీయ నాయకుడిగా మోదీ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఇక రెండోస్థానంలో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో కొనసాగుతున్నారు. ఆయనకు మోదీకున్న ఫాలోవర్లలో నాలుగోవంతు సబ్‌స్క్రైబర్లున్నారు. ఇక, దేశంలోనూ ఇతర నాయకులతో పోలిస్తే మోదీకి ఎక్కువ సబ్‌స్క్రైబర్లున్నారు. గత నెలలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 10కోట్ల ఫాలోవర్ల చరిత్రాత్మక మైలురాయిని ప్రధాని అధిగమించిన సంగతి తెలిసిందే.

# రాజ్యసభకు నితిన్ నబీన్



న్యూఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యసభ ఎన్నికలకు సన్నాహాలను వేగవంతం చేసింది. మంగళవారం 9 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో పార్టీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను బిహార్ నుంచి బరిలోకి దించనుంది. తొలివిడతగా మొత్తం ఆరు రాష్ట్రాల్లోని ఖాళీ అయ్యే స్థానాలకు బీజేపీ ప్రకటించిన పేర్లు ఇవే..బిహార్ నుంచి నితిన్ నబీన్, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి శివేష్ కుమార్, అసోం నుంచి ఎమ్మెల్యే తెరాష్ గోవాలా, రాష్ట్ర మంత్రి జోగెన్ మోహన్, ఛత్తీస్‌గఢ్ నుంచి పార్టీ రాష్ట్ర విభాగం ఉపాధ్యక్షురాలు లక్ష్మీ వర్మ, హరియాణా నుంచి లోక్‌సభ మాజీ ఎంపీ సంజయ్ భాటియా, ఒడిశా నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, రాజ్యసభ ఎంపీగా ఉన్న సుజీత్ కుమార్, పశ్చిమ బెంగాల్ నుంచి పార్టీ రాష్ట్ర మాజీ చీఫ్ రాహుల్ సిన్హా ఉన్నారు. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 37 రాజ్యసభ స్థానాలకు ఈనెల 16వ తేదీన పోలింగ్ జరగనుంది.

# ఫైనల్‌గా మృణాల్ ఠాకూర్‌కు జత కుదిరింది

సినిమాలో ఎప్పుడైనా, ఏదైనా జరగవచ్చు. ఊహించని కాంబో సెట్ కావచ్చు. ఇందుకు తాజా ఉదాహరణ నటి మృణాల్ ఠాకూర్‌నే. తెలుగులో సీతారామం అనే ఒక్క చిత్రంతో దక్షిణాదిలో పాపులర్ అయిన ఈ ఉత్తరాది బ్యూటీకి భారీగానే ఛాన్స్‌లు వచ్చాయి. ఆ తరువాత కొన్ని తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ.., హాయ్ నాన్న చిత్రం మినహా ఏదీ ఆశించిన విజయాలను అందుకోలేదు. దీంతో అవకాశాలు ముఖం చాటేశాయనే చెప్పాలి. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో నటించిన డెకాయిట్ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. ఇకపోతే అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రంలో ఒక నాయకిగా ఈ బ్యూటీ నటిస్తున్నారు. ఆ చిత్రం మాత్రమే చేతిలో ఉంది.

హిందీలో కొన్ని చిత్రాల్లో నటిస్తున్నా, తమిళంలో అవకాశాలు దోబూసులాడుతూనే ఉన్నాయి. ఈ మధ్య నటుడు ధనుష్‌తో ప్రేమాయణం అంటూ ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దాన్ని ఈమె కొట్టి పారేశారు కానీ, ధనుష్‌కు జంటగా ఒక చిత్రంలో నటించడానికి సిద్ధం అవతున్నారనే ప్రచారం మాత్రం జరిగింది.అయితే అది ఇప్పటి వరకూ ఫైనలైజ్ కాలేదు.

ఇలాంటి పరిస్థితుల్లో మరో సంచలన నటుడు శింబుతో జత కట్టే అవకాశాన్ని అందుకున్నారన్నది తాజా సమాచారం. శింబు ప్రస్తుతం వెట్రిమారన్ దర్శకత్వంలో అరసన్ అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఉత్తర చెన్నై నేపథ్యంలో సాగే గ్యాంగ్‌స్టార్ కథాంశంతో కూడిన ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే ఒక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది.

కాగా శింబు మరో చిత్రానికి గ్రీస్ సిగ్నల్ ఇచ్చారు. ఇంతకు ముందు ఓ మై కడవులే, డ్రాగన్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలను తెరకెక్కిన అశ్వద్ మారిముత్తు తాజాగా దర్శకత్వం వహించినున్న చిత్రంలో శింబు నటించనున్నారు. దీన్ని ఏజీఎస్ ఎంటర్‌ట్రైన్‌మెంట్ సంస్థ నిర్మించనుంది. కాగా ఇందులో నటుడు సంతానం ముఖ్య భూమికను పోషించనున్నారని సమాచారం. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందించనున్నారు. కాగా ఇందులో నాయకిగా నటి మృణాల్ ఠాకూర్ నటించనున్నారన్నది తాజా సమాచారం. అరసన్ చిత్రాన్ని పూర్తి చేసిన తరువాత శింబు ఈ చిత్రంలో నటించడానికి రెడీ అవుతారట. మొత్తం మీద చాలా కాలం పోరాటం తరువాత మృణాల్‌కు కోలీవుడ్ ఎంట్రీ షురూ అయ్యిందన్నమాట.





## భాగ్యశ్రీ బోర్సే స్పీడ్ కు బ్రేకులు.. చేతిలో ఒకే ఒక్క సినిమా

భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు కుర్రాళ్ల కొత్త నేషనల్ క్రష్. గతేడాది మాస్ మహారాజా రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. భారీ అంచనాలు మధ్య విడుదలైన ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. కానీ అందరి దృష్టిని ఆకర్షించింది ఈ అమ్మడు. తొలి చిత్రంలోనే గ్లామర్ షోతోపాటు అభినయంతో కట్టిపడేసింది ఈ వయ్యారి. కానీ ఫస్ట్ మూవీ డిజాస్టర్ కావడంతో ఆమెకు పెద్దగా హెల్ప్ కాలేదు. అయితే తెలుగులో నెమ్మదిగా ఆఫర్స్ మాత్రం అందుకుంది. మిస్టర్ బచ్చన్ తర్వాత ఈ అమ్మడు నటించిన కింగ్డమ్ సినిమా విడుదలైంది. ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత రామ్ తో కలిసి ఓ సినిమా దుల్కర్ తో ఓ సినిమా చేసింది. ఆంధ్రకింగ్ తాలూకా, దుల్కర్ కాంతా సినిమాలు కూడా ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి. దాంతో ఈ బ్యూటీకి ఆఫర్స్ తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం అఖిల్ నటిస్తున్న లెనిన్ అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా తప్ప ఇప్పుడు ఈ బ్యూటీ చేతిలో మరో సినిమా లేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com